జర్నలిస్ట్ డైరీ

తెలుగు దినపత్రిక



సంపుటి :13 సంచిక :80 సోమవారం | 23-11-2026 పేజీలు:8 వెల:రు 3 | https://www.epaperjournalistdiary.com/



సర్'ను అడ్డుకునే వారంతా

దేశద్రోహులే!

- ఓటర్ల జాబితా సవరణకు వ్యతిరేకించేవారిపై బండి సంజయ్ తీవ్ర వ్యాఖ్యలు
- అక్రమ చొరబాటుదారులకు ఓట్లు కోరేవారు మూర్ఖులంటూ మండిపాటు
- దేశంలో పాలకులను ఎన్నుకునే అధికారం భారతీయులకే
- బీజేపీని ఎదుర్కొనే ధైర్యం కాంగ్రెస్‌కు లేదని విమర్శ
- కాంగ్రెస్, బీఆర్ఎస్ ఒక్కటేనంటూ ఆరోపణలు
- రేవంత్‌రెడ్డికి బీజేపీ అంటే భయమని వ్యాఖ్య
- తెలంగాణలో సిక్కు సమాజాన్ని పాలకులు నిర్లక్ష్యం చేస్తున్నారని ఆవేదన
- ఇళ్లు, ఉపాధి, విద్యా సదుపాయాలు లేక సిక్కు కుటుంబాల ఇబ్బందులు
- ఓటర్ల జాబితాలో అక్రమ, దొంగ ఓట్ల తొలగింపే సవరణ లక్ష్యమని వెల్లడి
- దేశవ్యాప్తంగా చరిత్ర సృష్టించేలా మహాపాదయాత్ర నిర్వహిస్తామని ప్రకటన

తెలంగాణ బ్యూరో, ప్రతినిది

ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) ప్రక్రియను అడ్డుకునే వారంతా దేశద్రోహులేనని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. విదేశీ అక్రమ చొరబాటుదారులకు ఓట్లు కావాలని కోరుకునే వారంతా తన దృష్టిలో మూర్ఖులేనని మండిపడ్డారు. ఈ దేశంలో ప్రధాని, ముఖ్యమంత్రి మొదలుకొని ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులుగా ఎవరు ఉండాలనేది నిర్ణయించే అధికారం భారతీయ పౌరులకు మాత్రమే ఉందని స్పష్టం చేశారు. అర్హులైన భారతీయుల ఓటు హక్కును కాపాడటంతో పాటు అక్రమంగా ఓటు హక్కు పొందిన వారి పేర్లను తొలగించడమే సర్ ప్రక్రియ ఉద్దేశమని వివరించారు.

-మిగతా 2 లో

వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్‌కు

90 సీట్లు

వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో 90 సీట్లు, కోటి ఓట్లు సాధిస్తామన్న సీఎం రేవంత్ రెడ్డి

- రానున్న లోక్‌సభ ఎన్నికల్లో 15 స్థానాలు గెలవాలి
- రాహుల్‌గాంధీని ప్రధానిని చేసే బాధ్యత మనదే
- టీడీపీ, బీఆర్ఎస్ తరహాలో కాంగ్రెస్ కూడా పదేళ్లు పాలిస్తుంది
- ప్రభుత్వంపై బహిరంగ విమర్శలు చేసే వారి తీరును గమనిస్తున్నాం
- పార్టీ క్రమశిక్షణ పాటించే వారికి భవిష్యత్తులో గుర్తింపు
- సంక్రాంతి తర్వాత ప్రజల్లోకి వెళ్లేందుకు కార్యాచరణ సిద్ధం
- పార్టీ శ్రేణులకు ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి పిలుపు

02

హైదరాబాద్‌లో జరిగిన టీపీసీసీ రాజకీయ వ్యవహారాల కమిటీ, సలహా కమిటీ సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ 90 స్థానాలు గెలుచుకుని, కోటి ఓట్లు సాధించి మళ్లీ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. తెలంగాణలో కాంగ్రెస్ పాలన పదేళ్లపాటు కొనసాగుతుందని పేర్కొన్నారు. రానున్న లోక్‌సభ ఎన్నికల్లో రాష్ట్రంలోని 15 స్థానాలను గెలిచి రాహుల్‌గాంధీని ప్రధానిని చేసే బాధ్యత పార్టీ శ్రేణులపై ఉందని పిలుపునిచ్చారు. పార్టీ క్రమశిక్షణకు కట్టుబడి పనిచేయాలని నాయకులకు సూచించారు. సంక్రాంతి తర్వాత ప్రజల్లోకి వెళ్లేందుకు కార్యాచరణ సిద్ధం చేస్తున్నామని, ఎల్‌నినో ప్రభావంతో కరువు పరిస్థితులు తలెత్తకుండా ముందస్తు ప్రణాళికలు రూపొందిస్తున్నామని వెల్లడించారు.





02

అంతరిక్షంలో ఔషధాల తయారీ దిశగా

భారత్ ముందడుగు

- అంతరిక్షంలో సరికొత్త ఔషధాల అభివృద్ధిపై దృష్టి సారించిన భారత్
- మైక్రోగ్రావిటీ పరిస్థితుల్లో ప్రోటీన్ క్రిస్టల్స్ పెరుగుదలపై శాస్త్రవేత్తల పరిశోధనలు
- బెంగళూరు టెక్ సమ్మిట్‌లో స్పేస్ ఫార్మా అవకాశాలపై విస్తృత చర్చ
- అంతరిక్ష సాంకేతికతతో కొత్త ఔషధాల రూపకల్పన సాధ్యమన్న కిరణ్ మజుందార్ షా
- 2035 నాటికి సిద్ధం కానున్న భారతీయ అంతరిక్ష కేంద్రం



02

ట్రంప్ ప్రయత్నాలకు కిమ్ ఝలక్!

- ఫోన్ కాల్స్‌కు స్పందించని ఉత్తర కొరియా అధినేత
- ట్రంప్ పంపిన లేఖను సైతం స్వీకరించేందుకు నిరాకరణ
- గత ఏడాది నుంచే సంప్రదింపులకు అమెరికా ప్రయత్నాలు
- ఐక్యరాజ్యసమితి కార్యాలయం వద్ద లేఖ అందజేతకు యత్నం
- లేఖను తెరవకుండానే వెనక్కి ఇచ్చిన ఉత్తర కొరియా దౌత్యవేత్త
- చైనా పర్యటనలో కిమ్‌తో భేటీకి ట్రంప్ ఆసక్తి
- చివరి నిమిషం వరకు ప్రయత్నించినా ఫలించని సమావేశం
- అణ్వాయుధ దేశంగా గుర్తించాలన్న కిమ్ డిమాండ్‌తో ప్రతిష్టంభన



బిస్లెరీ వాటర్ లో ప్రమాదకర రసాయనాలు..

చర్యలకు సిద్ధమైన ఎఫ్ఎస్ఎస్ఏఐ

- నీటి నమూనాల్లో మోతాదుకు మించి బ్రోమేట్ మరియు పీఏహెచ్ రసాయనాలు
- బిస్లెరీ తాగునీరు సురక్షితం కాదని తేల్చిన ల్యాబ్ పరీక్షలు
- బిస్లెరీ ఇంటర్నేషనల్‌పై లీగల్ చర్యలకు ఎఫ్ఎస్ఎస్ఏఐ అనుమతి
- ఆశా కన్ఫెక్షనరీ చాక్లెట్ కుకీలను వెనక్కి తీసుకోవాలని ఆదేశం

ప్రైవేటు బస్సుల 'నో ఎంట్రీ' దందా!

- వనస్థలిపురం పరిధిలో నిబంధనలకు తూట్లు
- రాత్రి 8 గంటలకే జాతీయ రహదారి, సర్వీస్ రోడ్లపైకి ప్రైవేటు ట్రావెల్స్
- సర్వీస్ రోడ్ల ఆక్రమణతో వాహనదారులకు నరకయాతన
- చోద్యం చూస్తున్న ట్రాఫిక్ అధికారులు.



వనస్థలిపురం(జర్నలిస్ట్ డైరీ) :

నగర శివారులోని వనస్థలిపురం ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో ప్రైవేటు ట్రావెల్ బస్సుల ఆగడాలకు అడ్డూఅదుపూ లేకుండా పోతోంది. నిబంధనల ప్రకారం 'నో ఎంట్రీ' సమయం ముగియకముందే, రాత్రి 8 గంటల నుంచే ప్రైవేటు బస్సులు రోడ్లపైకి వచ్చి హల్‌చల్ చేస్తున్నాయి. విజయవాడ జాతీయ రహదారి (చీన-65)తో పాటు సర్వీస్ రోడ్లను పూర్తిగా ఆక్రమించుకుని ప్రయాణికులను ఎక్కించుకుంటుండటంతో నిత్యం తీవ్ర ట్రాఫిక్ జామ్ ఏర్పడుతోంది.

నిబంధనలు బేఖాతరు.. రద్దీ వేళల్లోనే ఎంట్రీ:


నగర ట్రాఫిక్ నిబంధనల ప్రకారం భారీ వాహనాలు, ప్రైవేటు ట్రావెల్ బస్సులు రాత్రి 10 గంటల తర్వాతే నగరంలోకి, ప్రధాన రహదారులపైకి రావాలి. కానీ వనస్థలిపురం పరిధిలోని పనామా గోడౌన్స్, చింతలకుంట, సుష్మ థియేటర్, హయత్‌నగర్ వైపు వెళ్లే మార్గాల్లో రాత్రి 8 గంటలకే పదుల సంఖ్యలో ప్రైవేటు బస్సులు దర్శనమిస్తున్నాయి. కార్యాలయాలు, వ్యాపార సముదాయాల నుంచి వాహనదారులు ఇళ్లకు చేరుకునే రద్దీ (పీక్ అవర్స్) సమయంలోనే ఈ బస్సులు రోడ్లపైకి రావడంతో ట్రాఫిక్ ఎక్కడికక్కడ స్తంభించిపోతోంది.


సర్వీస్ రోడ్లే పార్కింగ్ అడ్డాలు:

ప్రైవేటు ట్రావెల్స్ నిర్వాహకులు సర్వీస్ రోడ్లను తమ సొంత పార్కింగ్ స్థలాలుగా మార్చేశారు. రోడ్డుకు అడ్డంగా బస్సులను నిలిపి, గంటల తరబడి ప్రయాణికుల కోసం వేచి చూస్తున్నారు. దీనికి తోడు ప్రయాణికులను దించడానికి వచ్చే ఆటోలు, కార్లు కూడా అక్కడే నిలపడంతో సర్వీస్ రోడ్లు పూర్తిగా మూసుకుపోతున్నాయి. ఫలితంగా స్థానికులు, ద్విచక్ర వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అత్యవసర సమయాల్లో అంబులెన్స్‌లు సైతం ట్రాఫిక్‌లో చిక్కుకుపోయే దుస్థితి నెలకొంది.

-మిగతా 2 లో








సిజేరియన్ ప్రసవాల్లో దేశంలోనే తెలంగాణకు అగ్రస్థానం



న్యూఢిల్లీ

సిజేరియన్ ప్రసవాల విషయంలో తెలంగాణ దేశంలోనే అగ్రస్థానంలో నిలవడం ఆందోళన కలిగిస్తోంది. రాష్ట్రంలో జరుగుతున్న మొత్తం ప్రసవాల్లో ఏకంగా 62.2 శాతం సిజేరియన్ల ద్వారానే జరుగుతున్నట్లు జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే-6 గణాంకాలు వెల్లడించాయి. దేశవ్యాప్తంగా సిజేరియన్ల సగటు రేటు 27.2 శాతంగా ఉండగా, తెలంగాణలో ఇది రెట్టింపు కంటే ఎక్కువగా ఉండటం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. అంటే రాష్ట్రంలో జరిగే ప్రతి పది ప్రసవాల్లో ఆరుకు పైగా శస్త్రచికిత్సల ద్వారానే జరుగుతున్నాయి. 2023-24 సంవత్సరానికి సంబంధించిన ఈ సర్వే నివేదిక ప్రకారం.. ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల మధ్య ఈ విషయంలో భారీ వ్యత్యాసం కనిపిస్తోంది. రాష్ట్రంలోని ప్రైవేటు ఆసుపత్రుల్లో ఏకంగా 83.9 శాతం ప్రసవాలు సిజేరియన్ల ద్వారానే సాగుతున్నాయి. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఈ రేటు 48.1 శాతంగా ఉంది. జాతీయ స్థాయిలో ప్రైవేటు ఆసుపత్రుల్లో సిజేరియన్ల సగటు 54.1 శాతం మాత్రమే కావడం గమనార్హం. గత సర్వే (2019-21)లో 60.7 శాతంగా ఉన్న సిజేరియన్ల రేటు, ఇప్పుడు 62.2 శాతానికి పెరగడం గమనార్హం. పట్టణ ప్రాంతాల్లో ఇది 70.1 శాతంగా, గ్రామీణ ప్రాంతాల్లో 59.5 శాతంగా నమోదైంది. ఈ గణాంకాల నేపథ్యంలో, ప్రతి సిజేరియన్‌కు సరైన వైద్య కారణం ఉందా లేదా అన్నది నిశితంగా పరిశీలించాల్సిన అవసరం ఉందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ముఖ్యంగా ప్రైవేటు ఆసుపత్రుల్లో అనవసర సిజేరియన్లను అరికట్టేందుకు ఆసుపత్రుల వారీగా ఆడిట్ నిర్వహించాలని సూచిస్తున్నారు.


నవంబర్ చివరి వారంలో బంగాళాఖాతంలో మరో అల్పపీడనం!



న్యూఢిల్లీ

దక్షిణ అండమాన్ సముద్రం, ఆగ్నేయ బంగాళాఖాతం పరిసరాల్లో నవంబర్ నెలాఖరులో ఒక ఉపరితల ఆవర్తనం ఏర్పడే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) అంచనా వేసింది. అయితే దీనిపై తీర ప్రాంత ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ప్రస్తుతానికి ఎలాంటి తుపాను హెచ్చరికలు జారీ చేయలేదని వాతావరణ నిపుణులు స్పష్టం చేశారు. విశాఖపట్నం తుపాను హెచ్చరికల కేంద్రం అధిపతి పి.ఎల్.ఎన్. మూర్తి తెలిపిన వివరాల ప్రకారం... నవంబర్ 27 నుంచి డిసెంబర్ 2 మధ్య కాలంలో దక్షిణ అండమాన్ సముద్ర ప్రాంతంలో ఉపరితల ఆవర్తనం ఏర్పడవచ్చు. ఇది క్రమంగా బలపడి అల్పపీడనంగా మారే అవకాశాలు కనిపిస్తున్నాయి. అయితే, ఇది మరింత బలపడి వాయుగుండంగా మారుతుందా లేదా అనే అంశంపై ఇంకా ఎలాంటి స్పష్టత రాలేదు. ఒకవేళ బలపడినా కూడా, అది శ్రీలంక లేదా తమిళనాడు తీరం వైపు పయనించే అవకాశాలే ఎక్కువగా ఉన్నాయని, ఆంధ్రప్రదేశ్ వైపు వస్తుందని చెప్పలేమని ఆయన వివరించారు. దీని తీవ్రత, ప్రయాణించే మార్గానికి సంబంధించి ఐఎండీ ఇంకా ఎలాంటి అధికారిక ప్రకటన చేయలేదని తెలిపారు. సాధారణంగా ఉపరితల ఆవర్తనం అనేది వాతావరణ వ్యవస్థలలో అత్యంత ప్రాథమిక దశ మాత్రమేనని, ఇలా ఏర్పడే ప్రతి ఆవర్తనం తుపానుగా మారదని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. నవంబర్ 27 తర్వాత అల్పపీడనం ఏర్పడిన అనంతరమే దీని తదుపరి కదలికలపై ఒక అంచనాకు వచ్చే అవకాశం ఉంటుంది.

బిస్లెరీ వాటర్ లో ప్రమాదకర రసాయనాలు..



న్యూఢిల్లీ:

దేశంలో ప్రముఖ ప్యాకేజ్డ్ తాగునీటి తయారీ సంస్థ బిస్లెరీ ఇంటర్నేషనల్‌పై న్యాయపరమైన చర్యలు చేపట్టేందుకు భారత ఆహార భద్రత, ప్రమాణాల ప్రాధికార సంస్థ (ఎఫ్ఎస్ఎస్ఏఐ) సిద్ధమైంది. సంస్థకు చెందిన నీటి నమూనాలు సురక్షితం కాదని ప్రయోగశాల పరీక్షల్లో తేలడంతో ప్రాసిక్యూషన్ ప్రక్రియకు అనుమతి ఇచ్చింది. బిస్లెరీ ప్రాంగణం నుంచి సేకరించిన తాగునీటి నమూనాల్లో తొలుత నిర్ణీత పరిమితికి మించి బ్రోమేట్ ఉన్నట్లు గుర్తించారు. దీంతో ఆ నీటిని ఆహార భద్రత, ప్రమాణాల చట్టం-2006 ప్రకారం సురక్షితం కానిదిగా ప్రకటించారు. ప్రాథమిక పరీక్ష ఫలితాలపై బిస్లెరీ సంస్థ అప్పీల్ చేయడంతో నమూనాలను రెఫరల్ ఫుడ్ ల్యాబొరేటరీకి పంపించారు. అక్కడ నిర్వహించిన రెండో పరీక్షలోనూ నీటి నమూనాలు ప్రమాణాలకు అనుగుణంగా లేవని తేలింది. అంతేకాకుండా పాలీన్యూక్లియర్ ఆరోమాటిక్ హైడ్రోకార్బన్లు (పీఏహెచ్) ఉన్నట్లు గుర్తించారు. బ్రోమేట్, పీఏహెచ్‌లను ఆరోగ్యానికి హానికరమైన, క్యాన్సర్ ముప్పుతో సంబంధం ఉన్న రసాయనాలుగా పరిగణిస్తారు. పరీక్షల నివేదికల ఆధారంగా నిబంధనల ఉల్లంఘన జరిగినట్లు నిర్ధారించిన అధికారులు బిస్లెరీ ఇంటర్నేషనల్ ప్రైవేట్ లిమిటెడ్‌పై చట్టపరమైన చర్యలకు అనుమతి మంజూరు చేశారు. ఈ పరిణామంపై బిస్లెరీ సంస్థ నుంచి ఇంకా అధికారిక ప్రకటన వెలువడలేదు.

హైదరాబాద్ కు బాంబు బెదిరింపులు..

మొదటి తరువాయి

విజిబుల్ పోలీసింగ్‌ను మరింత ముమ్మరం చేశారు. కీలక కూడళ్లు, ప్రజలు ఎక్కువగా రాకపోకలు సాగించే ప్రాంతాల్లో గట్టి నిఘా ఏర్పాటు చేసి అనుమానితులను క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నారు. మరోవైపు, ఈ బెదిరింపు ఈమెయిల్ ఎక్కడి నుంచి వచ్చింది, ఎవరు పంపారు అనే వివరాలను రాబట్టేందుకు నగర సైబర్ క్రైమ్ పోలీసులు రంగంలోకి దిగారు. డిజిటల్ ఆధారాలు, ఐపీ అడ్రస్‌లను విశ్లేషిస్తూ నిందితులను గుర్తించి పట్టుకునేందుకు ముమ్మర దర్యాప్తు కొనసాగిస్తున్నారు. సోషల్ మీడియాలో గానీ, బయట గానీ వచ్చే నిరాధారమైన వదంతులను ఎవరూ నమ్మవద్దని, వాటిని ఇతరులకు ఫార్వర్డ్ చేసి భయాందోళనలు సృష్టించవద్దని నగర ప్రజలకు సీపీ విజ్ఞప్తి చేశారు. నగరంలో ఎక్కడైనా అనుమానాస్పద వ్యక్తులు సంచరిస్తున్నట్లు గమనించినా, లేదా గుర్తుతెలియని బ్యాగులు, వస్తువులు కనిపిస్తే వెంటనే డయల్ '112' ద్వారా సమాచారం అందించాలని సూచించారు. హైదరాబాద్ పోలీస్ విభాగం 24 గంటలూ ప్రజలకు అందుబాటులో ఉంటుందని, ప్రతి ఒక్కరి రక్షణకు కట్టుబడి ఉందని అధికారులు భరోసా ఇచ్చారు.

విదేశాల్లో దేశ ప్రతిష్టను దెబ్బతీస్తున్నారు!

చండీగఢ్: కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్‌గాంధీపై బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ తీవ్ర విమర్శలు చేశారు. విదేశీ పర్యటనలకు వెళ్లినప్పుడు భారత్ ప్రతిష్టను దెబ్బతీసేలా మాట్లాడుతున్నారని ఆరోపించారు. దేశ ఆర్థిక వ్యవస్థను సంక్షోభంలో ఉన్నట్లుగా చిత్రీకరిస్తూ తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. ఆదివారం చండీగఢ్‌లో నిర్వహించిన బీజేపీ బూత్ కార్యకర్తల సమావేశంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. దేశంలో జరుగుతున్న అభివృద్ధిని, ఆర్థిక వ్యవస్థ సాధిస్తున్న పురోగతిని విస్మరించి రాహుల్‌గాంధీ విమర్శలు చేస్తున్నారని అన్నారు. ప్రపంచ బ్యాంకు గణాంకాలను ప్రస్తావించిన నితిన్ నబీన్.. గత పదేళ్లలో దేశంలో 50 కోట్ల మంది పేదరికం నుంచి బయటపడ్డారని పేర్కొన్నారు. అంతర్జాతీయ సంస్థలు వెల్లడిస్తున్న సానుకూల ఆర్థిక గణాంకాలను కూడా రాహుల్‌గాంధీ అంగీకరించడం లేదని విమర్శించారు. దేశంలో పేదరికం తగ్గుతున్నా, ఆర్థిక వ్యవస్థ బలోపేతమవుతున్నా ప్రతిపక్ష నేత వాస్తవాలను వక్రీకరిస్తున్నారని ఆరోపించారు. విదేశాల్లో భారతదేశంపై ప్రతికూల అభిప్రాయం కలిగించేలా మాట్లాడటం ద్వారా దేశ ప్రయోజనాలకు విఘాతం కలిగిస్తున్నారని వ్యాఖ్యానించారు. ప్రధాని నరేంద్ర మోదీతో బహిరంగ చర్చకు రావాలంటూ రాహుల్‌గాంధీ చేసిన సవాల్‌పైనా నితిన్ నబీన్ స్పందించారు. పార్లమెంట్‌లో మాట్లాడే ధైర్యం లేకుండా వీడియోల ద్వారా సవాళ్లు విసురుతున్నారని ఎద్దేవా చేశారు. రాహుల్‌గాంధీతో చర్చించేందుకు ప్రధాని మోదీ అవసరం లేదని, బీజేపీ మండల అధ్యక్షుడే సరిపోతారని వ్యాఖ్యానించారు. ప్రజా సమస్యలు, దేశ అభివృద్ధి, ఆర్థిక పరిస్థితులపై చర్చించేందుకు ప్రతిపక్షాలకు అవకాశం ఉన్నప్పటికీ వాటిని సద్వినియోగం చేసుకోవడం లేదని విమర్శించారు.

సర్'ను అడ్డుకునే వారంతా దేశద్రోహులే!

మొదటి తరువాయి

కరీంనగర్‌లోని గురుద్వార్‌లో ఎంపీ ల్యాడ్స్ నిధులతో ఏర్పాటు చేసిన 11 కేవీ సౌర విద్యుత్ పలకలను బండి సంజయ్ ప్రారంభించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ ఓటర్ల జాబితా సవరణపై తన అభిప్రాయాలను వెల్లడించారు. 18 ఏళ్లు నిండిన అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించడం, ఒకరికి రెండు ఓట్లు ఉంటే అదనపు ఓటును తొలగించడం, మరణించిన వారి పేర్లను జాబితా నుంచి తొలగించడం సర్ ప్రధాన లక్ష్యాలని చెప్పారు. విదేశాల నుంచి అక్రమంగా వచ్చి ఓటు హక్కు పొందిన వారి పేర్లను తొలగించడంతో పాటు దొంగ ఓట్లను ఏరివేయడం ద్వారా నిజమైన భారతీయులకు ఓటు హక్కు కల్పించాలన్నదే ఈ ప్రక్రియ ఉద్దేశమని పేర్కొన్నారు. ఇలాంటి మంచి కార్యక్రమాన్ని అడ్డుకోవాలని చూడటం సరికాదన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేసిన రాజకీయ వ్యాఖ్యలపైనా బండి సంజయ్ స్పందించారు. కాంగ్రెస్, బీజేపీ మధ్య పోటీ లేదని, బీఆర్ఎస్‌తోనే తమకు పోటీ అని రేవంత్‌రెడ్డి పేర్కొనడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. బీజేపీ అంటే ముఖ్యమంత్రికి భయమని, ఆ పార్టీని ఎదుర్కొనే ధైర్యం కాంగ్రెస్‌కు లేదని విమర్శించారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ రెండూ ఒక్కటేనని ఆరోపించారు. బీజేపీని అడ్డుకోవాలనే లక్ష్యంతో ఆ రెండు పార్టీలు కలిసి కుట్రలు చేస్తున్నాయని అన్నారు. బీజేపీని ఎదుర్కొనే శక్తి కాంగ్రెస్‌కు లేదని వ్యాఖ్యానించారు. తెలంగాణలో అభివృద్ధి జరగాలన్నా, కేంద్రం నుంచి నిధులు రావాలన్నా బీజేపీతోనే సాధ్యమని ప్రజలు గుర్తించారని చెప్పారు. రాబోయే ఎన్నికల్లో బీజేపీ విజయం సాధించడం ఖాయమని, రాష్ట్రంలో ద్వంద్వ ఇంజిన్ ప్రభుత్వం ఏర్పడుతుందని ధీమా వ్యక్తం చేశారు. సిక్కు సమాజం పట్ల తనకు ప్రత్యేక అభిమానం ఉందని బండి సంజయ్ తెలిపారు. సిక్కులు కష్టపడి పనిచేసే వారని, దైవభక్తితో పాటు సమాజానికి సేవ చేయాలనే తపన కలిగిన వారని కొనియాడారు. గురునానక్, గురుగోబింద్‌సింగ్ బోధించిన మార్గంలో నడుస్తూ మానవత్వం, సేవాభావాన్ని చాటుకుంటారని చెప్పారు. అటక్ నుంచి కటక్ వరకు, కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు, ఆసియా నుంచి ఆఫ్రికా ఖండం వరకు ప్రపంచంలోని అనేక ప్రాంతాల్లో సిక్కులు కనిపిస్తారని పేర్కొన్నారు. వారు ఎక్కడ నివసించినా కష్టపడి పనిచేస్తూ ప్రశాంతమైన జీవనం కొనసాగిస్తారని అన్నారు. దేశం కోసం సిక్కు సమాజం చేసిన త్యాగాలు అసమానమైనవని బండి సంజయ్ గుర్తుచేశారు. భారత స్వాతంత్ర్య పోరాటంలో సిక్కుల పాత్ర చిరస్మరణీయమని, దేశ సరిహద్దుల్లో ప్రాణాలను పణంగా పెట్టి పోరాడుతున్న సిక్కు సైనికుల సేవలు వెలకట్టలేనివని పేర్కొన్నారు. పంజాబ్‌లో అనేక కుటుంబాలు తమ పిల్లల్లో ఒకరిని దేశ రక్షణ కోసం సైన్యంలోకి పంపాలనే భావనతో పెంచేవారని వివరించారు. సిక్కుల చరిత్రను చదివితే ధైర్యం, వారి త్యాగాలను స్మరించుకుంటే దేశభక్తి, వారి సేవలను చూస్తే మానవత్వం కనిపిస్తాయని అన్నారు. అలాంటి గొప్ప సమాజం సేవలను దేశం ఎప్పటికీ మర్చిపోకూడదని పేర్కొన్నారు.

వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్‌కు 90 సీట్లు

-రానున్న లోక్‌సభ ఎన్నికల్లో 15 స్థానాలు గెలవాలి
-రాహుల్‌గాంధీని ప్రధానిని చేసే బాధ్యత మనదే
-టీడీపీ, బీఆర్ఎస్ తరహాలో కాంగ్రెస్ కూడా పదేళ్లు పాలిస్తుంది
-ప్రభుత్వంపై బహిరంగ విమర్శలు చేసే వారి తీరును గమనిస్తున్నాం
-పార్టీ క్రమశిక్షణ పాటించే వారికి భవిష్యత్తులో గుర్తింపు
-సంక్రాంతి తర్వాత ప్రజల్లోకి వెళ్లేందుకు కార్యాచరణ సిద్ధం
-పార్టీ శ్రేణులకు ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి పిలుపు



హైదరాబాద్:

వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ 90 స్థానాలు గెలుచుకుని, కోటి ఓట్లు సాధించి మళ్లీ అధికారంలోకి వస్తుందని ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. తెలంగాణలో కాంగ్రెస్ పాలన పదేళ్లపాటు కొనసాగుతుందని స్పష్టం చేశారు. రానున్న లోక్‌సభ ఎన్నికల్లో రాష్ట్రంలోని 15 స్థానాలను గెలుచుకుని రాహుల్‌గాంధీని ప్రధానిని చేసే బాధ్యతను పార్టీ శ్రేణులు తీసుకోవాలని పిలుపునిచ్చారు. హైదరాబాద్‌లో జరిగిన టీపీసీసీ రాజకీయ వ్యవహారాల కమిటీ, సలహా కమిటీ సమావేశంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ 92,35,833 ఓట్లు సాధించి 64 స్థానాల్లో విజయం సాధించిందని రేవంత్‌రెడ్డి గుర్తుచేశారు. మిత్రపక్షమైన సీపీఐ ఒక స్థానాన్ని గెలుచుకుందని తెలిపారు. గతంలో తెలుగుదేశం పార్టీ, బీఆర్ఎస్ వరుసగా రెండుసార్లు అధికారంలోకి వచ్చినట్లుగానే కాంగ్రెస్ కూడా మరోసారి గెలిచి పదేళ్లపాటు రాష్ట్రంలో అధికారంలో ఉంటుందని పేర్కొన్నారు. ప్రజల్లో పార్టీకి ఆదరణ పెరుగుతోందని, రాబోయే ఎన్నికల్లో మరింత మెరుగైన ఫలితాలు సాధిస్తామని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. 2024 లోక్‌సభ ఎన్నికలకు ముందే బీజేపీకి 240 స్థానాలకు మించి రావని తాను చెప్పానని, ఎన్నికల ఫలితాలు తన అంచనాకు అనుగుణంగా వచ్చాయని రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. భవిష్యత్తులోనూ రాజకీయ పరిణామాలను దృష్టిలో పెట్టుకుని పార్టీ నాయకులు సమష్టిగా పనిచేయాలని సూచించారు. తెలంగాణ నుంచి 15 మంది ఎంపీలను గెలిపించుకుని, కేంద్రంలో కాంగ్రెస్ నాయకత్వానికి బలం చేకూర్చాలని పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. రాష్ట్ర ప్రభుత్వంపై బీఆర్ఎస్ అసత్య ప్రచారాలు చేస్తోందని ముఖ్యమంత్రి విమర్శించారు. అదే సమయంలో సొంత పార్టీ నాయకుల వ్యవహారశైలిపైనా ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రభుత్వంపై బహిరంగంగా ప్రతికూల వ్యాఖ్యలు చేయడం మానుకోవాలని సూచించారు. ఎవరు ఏమి మాట్లాడుతున్నారు, ఎలాంటి వ్యాఖ్యలు చేస్తున్నారనే విషయాలను పార్టీ నిశితంగా గమనిస్తోందని హెచ్చరించారు. పార్టీ నిర్ణయాలకు, క్రమశిక్షణకు అనుగుణంగా నడుచుకునే వారికి భవిష్యత్తులో తగిన గుర్తింపు లభిస్తుందని స్పష్టం చేశారు. సంక్రాంతి పండుగ తర్వాత ప్రభుత్వం నేరుగా ప్రజల్లోకి వెళ్లనుందని రేవంత్‌రెడ్డి వెల్లడించారు. ప్రభుత్వ కార్యక్రమాలు, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించడంతోపాటు క్షేత్రస్థాయిలో సమస్యలను తెలుసుకునేలా కార్యాచరణ రూపొందిస్తున్నామని తెలిపారు. ఎల్‌నినో ప్రభావంతో కరువు పరిస్థితులు ఏర్పడే అవకాశాలను దృష్టిలో ఉంచుకుని ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని చెప్పారు. వాతావరణ పరిస్థితుల కారణంగా రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన చర్యలు చేపట్టనున్నట్లు వివరించారు. తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన కులగణన దేశానికే ఆదర్శంగా నిలిచిందని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. సామాజిక వర్గాల స్థితిగతులను తెలుసుకునేందుకు రాష్ట్రంలో నిర్వహించిన కులగణన ఉపయోగపడిందని తెలిపారు. ఇదే విధానాన్ని ఆధారంగా చేసుకుని దేశవ్యాప్తంగా కులగణన చేపట్టాలని రాహుల్‌గాంధీ, ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాసినట్లు వివరించారు. తెలంగాణలో చేపట్టిన కులగణన ఫలితాలను జాతీయ స్థాయిలోనూ ఉపయోగించుకోవాల్సిన అవసరం ఉందని రేవంత్‌రెడ్డి అభిప్రాయపడ్డారు.

హైదరాబాద్‌లో పైవేటు బస్సుల 'నో ఎంట్రీ' దందా!

(మొదటి తరువాయి)










పట్టించుకోని ట్రాఫిక్ యంత్రాంగం:

ఇంత జరుగుతున్నా వనస్థలిపురం ట్రాఫిక్ పోలీసులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. కూడళ్ల వద్ద విధుల్లో ఉండే సిబ్బంది కళ్లముందే నో ఎంట్రీ సమయంలో బస్సులు దూసుకెళ్తున్నా, సర్వీస్ రోడ్లను ఆక్రమించి పార్కింగ్ చేస్తున్నా కనీసం జరిమానాలు విధించడం లేదని వాహనదారులు మండిపడుతున్నారు. ట్రావెల్స్ యాజమాన్యాలతో కుమ్మక్కై నెలవారీ మామూళ్ల మత్తులో అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలు బలంగా వినిపిస్తున్నాయి. ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి నో ఎంట్రీ నిబంధనలను కఠినంగా అమలు చేయాలని, సర్వీస్ రోడ్లను ఆక్రమించే ప్రైవేటు బస్సులపై కేసులు నమోదు చేసి ట్రాఫిక్ కష్టాల నుంచి విముక్తి కల్పించాలని స్థానికులు కోరుతున్నారు.



ట్రంప్ ప్రయత్నాలకు కిమ్ ఝలక్!

వాషింగ్టన్:

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు ఉత్తర కొరియా అధినేత కిమ్ జోంగ్ ఉన్ నుంచి స్పందన కరువైంది. కిమ్‌తో మాట్లాడేందుకు ట్రంప్ పలుమార్లు ప్రయత్నించినప్పటికీ ఆయన పట్టించుకోలేదని వాల్‌స్ట్రీట్ జర్నల్ కథనం వెల్లడించింది. ఫోన్ కాల్స్‌కు సమాధానం ఇవ్వకపోగా, ట్రంప్ పంపిన లేఖను కూడా స్వీకరించేందుకు నిరాకరించినట్లు పేర్కొంది. గత ఏడాది నుంచే కిమ్‌తో సంప్రదింపులు జరిపేందుకు అమెరికా అధ్యక్షుడు ప్రయత్నిస్తున్నట్లు సమాచారం. తాజా అధికారిక దౌత్య మార్గాల ద్వారా కిమ్‌ను ఫోన్‌లో సంప్రదించేందుకు అమెరికా అధికారులు ప్రయత్నించారు. అయినప్పటికీ ఉత్తర కొరియా నుంచి స్పందన రాకపోవడంతో ట్రంప్ నేరుగా లేఖ పంపాలని నిర్ణయించారు. ఈ క్రమంలో న్యూయార్క్‌లోని ఐక్యరాజ్యసమితిలో ఉన్న ఉత్తర కొరియా శాశ్వత మిషన్ వద్ద అమెరికా అధికారులు లేఖను అందజేసేందుకు ప్రయత్నించారు. అక్కడి దౌత్యవేత్తకు లేఖను అందించగా, ఆయన దానిని తెరవకుండానే అమెరికా ప్రతినిధి ముందు తిరిగి ఉంచినట్లు కథనం పేర్కొంది. ఈ పరిణామం ఇరు దేశాల మధ్య దౌత్య సంబంధాల్లో నెలకొన్న దూరాన్ని మరోసారి వెల్లడించింది. ఇటీవల ఆసియా పర్యటన సందర్భంగా చైనాలో కిమ్ జోంగ్ ఉన్‌తో సమావేశమయ్యేందుకు ట్రంప్ ఆసక్తి చూపారు. అయితే ఉత్తర కొరియా నుంచి ఎలాంటి సానుకూల స్పందన రాలేదు. చివరి నిమిషం వరకు భేటీ కోసం ప్రయత్నాలు జరిగినప్పటికీ సమావేశం సాధ్యం కాలేదు. దీంతో కిమ్‌తో భేటీ లేకుండానే ట్రంప్ తన పర్యటనను ముగించుకుని అమెరికాకు తిరిగి వెళ్లారు. ఉత్తర కొరియా విధించిన షరతులు అమెరికాకు ఆమోదయోగ్యంగా లేకపోవడంతో చర్చలు ముందుకు సాగలేదని అంతర్జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి.

అంతరిక్షంలో ఔషధాల తయారీ దిశగా భారత్ ముందడుగు

న్యూఢిల్లీ:

భారతదేశం తన విస్తరిస్తున్న అంతరిక్ష సాంకేతిక సామర్థ్యాలను ఫార్మా రంగంతో అనుసంధానించి, సరికొత్త ఔషధాల ఆవిష్కరణకు మార్గం సుగమం చేస్తోంది. అంతరిక్షంలోని మైక్రోగ్రావిటీ (భార రహిత స్థితి) వాతావరణాన్ని వినియోగించుకుని నెక్స్ట్ జనరేషన్ మందులను ఎలా అభివృద్ధి చేయవచ్చనే అంశంపై భారత శాస్త్రవేత్తలు, బయోటెక్నాలజీ కంపెనీలు, స్టార్టప్‌లు ముమ్మరంగా దృష్టి సారిస్తున్నాయి. ఇటీవల నవంబర్ 19న ముగిసిన బెంగళూరు టెక్ సమ్మిట్‌లో అంతరిక్షంలో ఔషధాల తయారీ, ప్రయోగాల నిర్వహణపై కీలక చర్చ జరిగింది. భవిష్యత్తులో దేశం నిర్మించనున్న అంతరిక్ష మౌలిక సదుపాయాలు బయోటెక్నాలజీ పరిశోధనలకు ఎలా ఉపయోగపడతాయనే విషయాన్ని పరిశోధకులు, విధాన రూపకర్తలు, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు విస్తృతంగా పరిశీలించారు. ప్రపంచవ్యాప్తంగా సరసమైన ధరలకే నాణ్యమైన మందులు, టీకాలను సరఫరా చేస్తూ 'ప్రపంచ ఫార్మసీ'గా గుర్తింపు పొందిన భారత్, ఇప్పుడు తన ఔషధ తయారీ శక్తిని అంతరిక్ష ప్రయోగాలతో కలపాలని భావిస్తోంది. భూమిపై గురుత్వాకర్షణ శక్తి కారణంగా ప్రోటీన్ క్రిస్టల్స్ ఏర్పడే తీరుపై ప్రభావం పడుతుంది. అదే అంతరిక్షంలోని దాదాపు భార రహిత వాతావరణంలో ఈ క్రిస్టల్స్ అత్యంత సమతుల్యంగా పెరుగుతాయి. దీనివల్ల ప్రోటీన్ల నిర్మాణాన్ని శాస్త్రవేత్తలు లోతుగా అధ్యయనం చేయడానికి వీలవుతుంది. ఈ పరిశీలనలు ఔషధ సూత్రీకరణలను మెరుగుపరచడమే కాకుండా, కొత్త చికిత్సా పద్ధతుల అభివృద్ధిని వేగవంతం చేస్తాయని నిపుణులు వివరిస్తున్నారు.

-మిగ

జర్నలిస్ట్ డైరీ
తెలుగు దినపత్రిక

నిండు జీవితానికి రెండు చుక్కలు

పోలియో రహిత భారతదేశమే మన లక్ష్యం - ఆరెకపూడి గాంధీ



రంగారెడ్డి జిల్లా బ్యూరో, నవంబర్ 22 (జర్నలిస్ట్ డైరీ) :
పల్స్ పోలియో కార్యక్రమం లో భాగంగా శేరిలింగంపల్లి డివిజన్ పరిధిలోని శేరిలింగంపల్లి లో గల పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం లో జరిగిన పల్స్ పోలియో కార్యక్రమం లో ముఖ్యఅతిథిగా పాల్గొని వైద్య సిబ్బంది తో కలిసి 0-5 సంవత్సరాల లోపు చిన్నారులకు పోలియో చుక్కలు వేసిన పిదప శేరిలింగంపల్లి డివిజన్ చైర్మన్ ఆరెకపూడి గాంధీ.ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ నిండు జీవితానికి రెండు చుక్కలు చాలు అని. అప్పుడే పుట్టిన పిల్లల నుంచి ఐదేళ్ల లోపు వయస్సు గల ప్రతి చిన్నారికి తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని తెలిపారు. పోలియో రహిత భారతదేశమే మన అందరి లక్ష్యమని, దీనిని సాధించాలంటే ప్రతి బిడ్డకూ క్రమం తప్పకుండా పోలియో చుక్కలు వేయించాలని, ప్రభుత్వం అందిస్తున్న అన్ని టీకాలను తప్పనిసరిగా వేయించాలని పిలుపునిచ్చారు. తల్లిదండ్రులను ఉద్దేశించి మాట్లాడుతూ, మీ పిల్లల ఆరోగ్యం కోసం దగ్గరలోని పోలియో కేంద్రానికి వెళ్లి చుక్కల మందు వేయించాలని, ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని, ఇది పూర్తిగా ఉచితం, సురక్షితమని సూచించారు.దేశాన్ని పోలియో రహితంగా నిలబెట్టడంలో ప్రతి తల్లిదండ్రి బాధ్యతగా తమ ఐదేళ్లలోపు పిల్లలకు తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని ,సామాజిక బాధ్యతగా తీసుకోవాలని, ప్రభుత్వం చేపడుతున్న ప్రజారోగ్య కార్యక్రమాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని తెలియచేశారు. పల్స్ పోలియో చుక్కలు అనేవి భారతదేశంలో పోలియో వ్యాధిని పూర్తిగా నిర్మూలించడానికి భారత ప్రభుత్వం చేపట్టిన ఒక భారీ రోగనిరోధక కార్యక్రమం అని, అప్పుడే పుట్టిన శిశువుల నుండి 5 సంవత్సరాల లోపు వయస్సు ఉన్న ప్రతి చిన్నారికి పోలియో చుక్కలు వేయడం దీని ముఖ్య ఉద్దేశ్యం.ఈ చుక్కలు అత్యంత సురక్షితమైనవి మరియు ఉచితంగా వేయబడతాయి. దీనివల్ల పిల్లలకు జీవితకాలం పోలియో పక్షవాతం రాకుండా రక్షణ లభిస్తుంది.అని పల్స్ పోలియో రోజున రేపు ఉదయం 7 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలు, బస్టాండ్ లు మరియు ఇతర ప్రత్యేక కేంద్రాలలో చుక్కల మందు వేస్తారు అని తెలియచేశారు. బూత్‌లకు రాని పిల్లల కోసం, ఆరోగ్య కార్యకర్తలు తరువాతి 2 నుండి 3 రోజుల పాటు ఇంటింటికీ తిరిగి చుక్కలు వేస్తారు అని,పూర్తి స్థాయిలో పోలియో చుక్కలు వేసి పోలియో రహిత దేశంగా , పోలియో రహిత రాష్ట్రంగా, పోలియో రహిత శేరిలింగంపల్లి నియోజకవర్గంగా తీర్చిదిద్దడం లో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని, స్వచ్ఛందంగా ప్రతిఒక్కరు సామాజిక బాధ్యత తో పల్స్ పోలియో చుక్కలు వేయించేల చూడాలని తెలియచేశారు.ఈ కార్యక్రమంలో డాక్టర్ అనూష, డాక్టర్ దివ్య, వైద్య సిబ్బంది, నాయకులు బాలింగ్ గౌతమ్ గౌడ్, లక్ష్మారెడ్డి, మిరియాల ప్రీతమ్, సాదిక్ కార్యకర్తలు, కాలనీ వాసులు, తదితరులు పాల్గొన్నారు.


మద్యం రక్కసికి అడ్డుకట్ట. ఆలంపల్లిలో బెల్ట్ షాపుల బంద్!





జర్నలిస్ట్ డైరీ వికారాబాద్ నవంబర్ 22
గ్రామంలో అక్రమ బెల్ట్ షాపులను పూర్తిగా మూసివేయాలని వికారాబాద్ పట్టణంలోని ఆలంపల్లి గ్రామ ప్రజలు, యువకులు తీర్మానించారు. మద్యం వల్ల కుటుంబాలు నష్టపోతూ, అనారోగ్యంతో పలువురు మరణిస్తున్నారని, బయటి వ్యక్తుల రాకపోకలతో గ్రామంలో అశాంతి నెలకొంటోందని ఆవేదన వ్యక్తం చేశారు.గ్రామ ప్రశాంతత కోసం, యువత గంజాయి వంటి మత్తుపదార్థాలకు దూరంగా ఉండేలా ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. భవిష్యత్తులో మద్యం అమ్మకాలు జరగకుండా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి కఠిన చర్యలు తీసుకునేలా చూస్తామని గ్రామస్థులు స్పష్టం చేశారు.

నాగోలు పీఎస్ పరిధిలో జ్యూవెలరీ షాపులో గోడకు రంధ్రం చేసి చోరీ..

-అరకేజీ వెండి, రూ. 1.50 లక్షల నగదు, ఇతర వస్తువులు చోరీకి పాల్పడిన నిందితులు..











జర్నలిస్ట్ డైరీ: ఎల్బీనగర్:
గుర్తు తెలియని నిందితులు జ్యూవెలరీ షాపుకు గోడకు రంధ్రం చేసి లోపలికి వెళ్లి దుకాణంలో ఉన్న రూ. 1.50 లక్షలు నగదు, అరకేజీ వెండి ఆభరణాలు, 35 వేలు విలువచేసే రోల్డ్ గోల్డ్ వస్తువులు నిందితులు చోరీ చేసుకుని పారిపోయిన సంఘటన నాగోలు పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. సంఘటన. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం. నాగోలు బండ్లగూడ ఆనంద్ నగర్ ఎక్స్ రోడ్డులో గల ఆశాపుర పాన్ బ్రోకర్, జ్యూవెలర్స్ దుకాణం గత తొమ్మిదేళ్లుగా మహేందర్ సింగ్ నిర్వహిస్తున్నాడు. శనివారం అర్ధరాత్రి ముగ్గురు గుర్తుతెలియని వ్యక్తులు జ్యూవెలర్స్ దుకాణంలో పక్కనే ఉన్న లావెండర్ బ్యూటీ పార్లర్‌కు ఆనుకున్న దుకాణం వెనుక గోడకు రంధ్రం చేసి నిందితులు ముగ్గురు లోపలికి ప్రవేశించారు. దుకాణంలో ఉన్న నగదు, వెండి ఆభరణాలు, రోల్డ్ గోల్డ్ వస్తువులు ఇతర విలువైన వస్తువులు చోరీ చేసుకుని పారిపోయారు. ఇది గమనించిన స్థానికులు నాగోలు పోలీసులకు సమాచారం అందించారు. ఈమేరకు పోలీసులు వెంటనే స్పందించి సంఘటన స్థలానికి చేరుకుంటారు. అక్కడ ఉన్న సీసీ కెమెరాలను పోలీసులు పరిశీలించారు. ముగ్గురు నిందితులు గోడకు రంధ్రం చేసి లోపలికి ప్రవేశించినట్టు కెమెరాల్లో రికార్డు అయింది. సమాచారం అందుకున్న ఎల్బీనగర్/ఏసీపీ బి. రవీంద్రారెడ్డి, నాగోలు ఇన్‌స్పెక్టర్ ముత్యాల జానీ, క్లూస్ టీమ్, సీసీఎస్ ఎల్బీనగర్ అధికారులు సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. క్లూస్ టీమ్ నాలుగు వేలిముద్రలను సేకరించింది. నిందితులను గుర్తించి పట్టుకునేందుకు పోలీసులు పరిసర ప్రాంతాల్లోని సీసీటీవీ ఫుటేజీలను పరిశీలిస్తూ, ప్రత్యేక బృందాలతో గాలింపు చర్యలు చేపట్టారు. ఈమేరకు నాగోలు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.


మిట్టకోడూర్ పంచాయతీ కార్యదర్శి నిర్లక్ష్యంపై చర్యలకు సిద్ధమవుతున్న ఉన్నత అధికారులు

-పాత కారు సాకుతో నిరుపేద ఆసరా పింఛన్ రద్దు
-పత్రాలు అడగకుండానే ఫోటో దిగి వెళ్లిన వైనం
-విధులకు గైర్హాజరు, నిధుల దుర్వినియోగం ఆరోపణలతో షోకాజ్ నోటీసులు
-కార్యదర్శిని తక్షణమే సస్పెండ్ చేయాలని గ్రామస్తుల డిమాండ్..
చర్యలకు సిద్ధమవుతున్న యంత్రాంగం









జర్నలిస్ట్ డైరీ పరిగి, నవంబర్ 22:



వికారాబాద్ జిల్లా పరిగి మండలం మిట్టకోడూర్ పంచాయతీ కార్యదర్శి ఎస్. బాలకిషన్ నిర్లక్ష్యం వల్ల ఒక నిరుపేద ఆసరా పింఛన్ కోల్పోయాడు. గతంలోనే కారు అమ్మి, ఆర్సీ (RC) బదిలీ చేసినప్పటికీ.. విచారణ సమయంలో కార్యదర్శి కనీస పత్రాలు అడగకుండా కేవలం ఫోటో దిగి వెళ్లడంతో పాత డేటా ఆధారంగా పింఛన్ కట్ అయింది. పత్రాలు అడిగి ఉంటే అప్పుడే చూపించేవాళ్లమని బాధితుడు ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు.ఇటీవల ప్రభుత్వ అధికారిక కార్యక్రమాలకు అనుమతి లేకుండా గైర్హాజరైనందుకు ఎంపీడీవో షోకాజ్ మెమో ఇచ్చినా, ఆలస్యంగా స్పందించి నిర్లక్ష్యం ప్రదర్శించాడు. గతంలోనూ నిధుల దుర్వినియోగంపై కలెక్టర్, డీపీవోలకు ఉపసర్పంచ్ ఆధ్వర్యంలో వార్డు నెంబర్లు ఫిర్యాదు చేసిన సందర్భంలో నోటీసులు అందుకోవడం జరిగింది. వరుస తప్పిదాలకు పాల్పడుతున్న కార్యదర్శి నిర్లక్ష్య వైఖరికి నిరసనగా తక్షణమే సస్పెండ్ చేసి, బాధితుడికి పింఛన్ పునరుద్ధరించాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో కార్యదర్శి వ్యవహారశైలి, వరుస ఫిర్యాదులను తీవ్రంగా పరిగణించిన ఉన్నత అధికారులు ఆయనపై కఠిన చర్యలు తీసుకునే దిశగా ఆలోచిస్తున్నట్లు సమాచారం.

వృద్ధుల ఆధ్యాత్మిక యాత్రకు ప్రభుత్వం ప్రత్యేక సౌకర్యాలు కల్పించాలి!

ఉచిత బస్సు ప్రయాణం, దైవదర్శనం, వసతి కల్పించాలని విజ్ఞప్తి



హైదరాబాద్:నవంబర్ 22 జర్నలిస్ట్ డైరీ
వృద్ధుల సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తూ, 60 ఏళ్ల పైబడిన వారికి ఉచిత బస్సు ప్రయాణంతో పాటు ప్రముఖ పుణ్యక్షేత్రాల్లో ఉచిత దైవదర్శనం, వసతి సౌకర్యాలు కల్పించేలా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక పథకాన్ని అమలు చేయాలని గౌడ విద్యావంతుల వేదిక (GVV) అధ్యక్షుడు పల్లె ఉపేందర్ గౌడ్ కోరారు.ఈ మేరకు ఆయన ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తూ, వృద్ధాప్యంలో ఆర్థిక ఇబ్బందులు, అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటున్న అనేకమంది తమకు ఇష్టమైన పుణ్యక్షేత్రాలను సందర్శించాలనే ఆకాంక్ష ఉన్నప్పటికీ, ప్రయాణం, వసతి ఖర్చులు భరించలేక ఆ కోరికను నెరవేర్చుకోలేకపోతున్నారని పేర్కొన్నారు.ఈ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని 60 సంవత్సరాలు దాటిన వృద్ధులందరికీ రాష్ట్రవ్యాప్తంగా ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించాలని సూచించారు. అలాగే రాష్ట్రంలోని ప్రముఖ దేవాలయాలు, పుణ్యక్షేత్రాల్లో వృద్ధులకు ప్రత్యేక ప్రాధాన్యతనిస్తూ ఉచిత దైవదర్శనం కల్పించడంతో పాటు, దేవస్థానాల ఆధ్వర్యంలో ఉచిత వసతి సౌకర్యాలను కూడా అందుబాటులోకి తీసుకురావాలని కోరారు.
జీవితంలో ఎన్నో ఒడిదుడుకులను ఎదుర్కొని, 60, 70 సంవత్సరాల అనుభవాన్ని సంపాదించిన వృద్ధులు తమ కుటుంబాలకు విద్యాబుద్ధులు నేర్పి, పిల్లలను మంచి పౌరులుగా తీర్చిదిద్దడంలో కీలక పాత్ర పోషించారని ఉపేందర్ గౌడ్ గుర్తుచేశారు. అంతేకాకుండా తమ జీవితకాలంలో ప్రభుత్వానికి పన్నులు చెల్లిస్తూ సమాజ అభివృద్ధికి తోడ్పడిన వారని తెలిపారు.అటువంటి వృద్ధాప్య దశలో ఉన్న వారికి ఆధ్యాత్మికంగా ప్రశాంతతను అందించడం, వారు కోరుకున్న పుణ్యక్షేత్రాలను సందర్శించేందుకు అవసరమైన రవాణా, దర్శనం, వసతి సౌకర్యాలు కల్పించడం ప్రభుత్వ సామాజిక బాధ్యతగా గుర్తించాలని ఆయన అభిప్రాయపడ్డారు.ముఖ్యంగా రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఈ ప్రతిపాదనపై ప్రత్యేక దృష్టి సారించి, వృద్ధులకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించేలా చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా ముఖ్యమంత్రి, సంబంధిత శాఖల మంత్రులు ఈ అంశాన్ని పరిశీలించి, వృద్ధుల ఆధ్యాత్మిక యాత్రకు దోహదపడేలా ప్రత్యేక సంక్షేమ పథకాన్ని రూపొందించి వీలైనంత త్వరగా అమల్లోకి తీసుకురావాలని గౌడ విద్యావంతుల వేదిక అధ్యక్షుడు పల్లె ఉపేందర్ గౌడ్ ప్రభుత్వాన్ని కోరారు.

కుటుంబ కలహాలతో బావపై బామ్మర్దులు దాడి....


తీవ్రంగా గాయపడ్డ బావ ఆసుపత్రిలో తరలింపు....



నాగోలు :
నవంబర్ 22 జర్నలిస్ట్ డైరీ
కుటుంబ కలహాలతో సొంత బావపై బామ్మర్దులు దాడి చేసి తీవ్రంగా గాయపరిచిన సంఘటన హయత్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం రాత్రి చోటు చేసుకుంది.. సంఘటన వివరాలు ప్రకారం.. హయత్ నగర్ సూర్య నగర్ కాలనీ రోడ్ నెంబర్ 8 లో నివాసం ఉండే మల్లేష్, మహేశ్వరి భార్య భర్తలు.. వీరికి ఒక కుమారుడు ఉన్నాడు.. భార్య మహేశ్వరి కడుపుతో ఉండడంతో పుట్టింటికి వెళ్ళింది.. మల్లేష్ నగరంలో కార్ డ్రైవర్ గా పని చేస్తున్నాడు.. గత కొంతకాలంగా మల్లేష్ అత్తారింటి వారితో కుటుంబ కలలు నడుస్తున్నాయి.. ఆదివారం రాత్రి అతని సొంత బామ్మర్దిలు, ముగ్గురు కలిసి వచ్చి మల్లేష్ పై తీవ్రంగా దాడి చేశారు.. స్థానికులు అడ్డుకొని హయత్ నగర్ పోలీసులకు సమాచారం ఇచ్చారు.. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకున్న లేపే నిందితుల పారిపోయారు.. గాయపడ్డ మల్లేష్ ను చికిత్స నిమిత్తం హాస్పిటల్ తరలించారు.. బాధితుల ఫిర్యాదు మేరకు హయత్ నగర్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు...

జర్నలిస్ట్ డైరీ
తెలుగు దినపత్రిక

నేడు రాపోల్‌లో ఇండస్ట్రియల్ పార్క్ భూసేకరణపై గ్రామసభ


General Notice
(See Rule 22 (4))

No. G/254/2026 Dated: 02.11.2026

NOTICE

Sub:- Land Acquisition – TGIIC - Vikarabad District - Vikarabad Division - Pargi Mandal - Rapole Village – requisition proposals submitted by the Zonal Manager, TGIIC Ltd., to acquire Ac. 612-18 gts. of land for establishment of Industrial Park by TGIIC Ltd. – Socio-Economic Survey conducted – Publication of Draft R&R Scheme and Notice for Public Hearing under Rule 22(4) – Reg.

Ref:- 1. Preliminary Notification in Form-C issued vide Gazette, Nos. VKB-21/2026 and VKB-32/2026, dated: 13.02.2026 and 16.03.2026 respectively.
2. The District Collector, Vikarabad appointed Administrator vide Proc. No. G/254/2026, dated 11.03.2026

It is to inform that the preliminary notifications U/s. 11(2) of the Right to Fair Compensation and Transparency in Land acquisition, Rehabilitation and Resettlement Act, 2013 (General Act 30 of 2013) as amended by the Right to Fair Compensation and Transparency in land Acquisition, Rehabilitation and Resettlement Act, 2013 (Central) Act, 2016 (Act No. 21 of 2017), were published in the Telangana State Gazette, Nos. VKB-21/2026 & VKB-32/2026, dated: 13.02.2026 and 16.03.2026 respectively, and notified the land to an extent of Ac.612-18gts in Rapole Village of Pargi Mandal for establishment of Industrial Park in favour of TGIIC Ltd. In this regard, for the Rehabilitation and Resettlement, the survey has been undertaken and a census of the affected families and draft Rehabilitation and Resettlement Scheme is prepared.

In view of the above, the undersigned has decided to conduct Public Hearing at Gram Panchayath Rapole Village of Pargi Mandal on 23.11.2026. Hence it is hereby requested all affected families/ persons/interested persons to attend the Public Hearing on 23.11.2026 at 10.30 AM without fail.

Project Administrator
Additional Collector (Rev),
Vikarabad District.

To
The Tahsildar, Pargi Mandal to make adequate publicity about public hearing and to inform all the interested persons and to make arrangements for Public Hearing in Rapole Village of Pargi Mandal.

Copy to the LAO/RDO, Vikarabad Division for taking necessary action.

Panchayath Secretary
G.P. RAPOLE,
Dist: Pargi, Vikarabad Dist. T.S.





జర్నలిస్ట్ డైరీ పరిగి నవంబర్ 22

పరిగి మండలం రాపోల్ గ్రామంలో టీజీఐఐసీ ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటుకు సంబంధించి పునరావాస మరియు పునర్నిర్మాణ ముసాయిదా పథకంపై నేడు ఉదయం 10:30 గంటలకు రాపోల్ గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద ప్రత్యేక గ్రామసభ నిర్వహించనున్నట్లు పరిగి మండల తహసీల్దార్ ఒక ప్రకటనలో తెలిపారు. రాపోల్ గ్రామ పరిధిలో ఇండస్ట్రియల్ పార్క్ స్థాపన కోసం టీజీఐఐసీ లిమిటెడ్ ద్వారా 612 ఎకరాల 18 గుంటల భూసేకరణకు ప్రతిపాదనలు అందాయని, దీనికి సంబంధించి సామాజిక-ఆర్థిక సర్వే పూర్తయి ముసాయిదా R*R పథకం సిద్ధమైందని నోటీసులో పేర్కొన్నారు. వికారాబాద్ జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) మరియు ప్రాజెక్ట్ అడ్మినిస్ట్రేటర్ ఆదేశాల మేరకు ఈ ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహిస్తున్నట్లు తెలిపారు,కావున భూసేకరణ ప్రభావిత కుటుంబాలు, సంబంధిత వ్యక్తులు మరియు ఆసక్తి గల వారు రేపు ఉదయం 10:30 గంటలకు తప్పనిసరిగా హాజరుకావాలని కోరారు.

సిద్దాపూర్ డంపింగ్ యార్డు రద్దు చేయాలని 50 రోజులుగా కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలు

-రాష్ట్ర ప్రభుత్వం స్పందించి వెంటనే జీవో 641 రద్దు చేయాలి.
-ముడావత్ రాంబల్ నాయక్, రాష్ట్ర అధ్యక్షులు, లంబాడీ హక్కుల పోరాట సమితి.



రంగారెడ్డి జిల్లా బ్యూరో, నవంబర్ 22 (జర్నలిస్ట్ డైరీ) :

రంగారెడ్డి జిల్లా,నందిగామ మండలం సిద్దాపూర్ గ్రామంలో ఎకో టౌన్ పేరుతో రాష్ట్ర ప్రభుత్వం డంపింగ్ యార్డు ఏర్పాటు కోసం జీవో 641 తీసుకొచ్చింది. దీనిని వ్యతిరేకిస్తూ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో సిద్దాపూర్ డంపింగ్ యార్డు వ్యతిరేక పోరాట జాయింట్ యాక్షన్ కమిటీ ని ఏర్పాటు చేసుకుని సేవ్ సిద్దాపూర్ నినాదంతో 50 రోజులుగా గ్రామంలో నిరవధిక రిలే నిరాహార దీక్షలు కొనసాగుతున్నాయి. అందులో భాగంగా 50 వ రోజు దీక్షలో కోనాయి పల్లి గ్రామస్తులు మరియు ఎల్బపియెస్ షాద్ నగర్ డివిజన్ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా లంబాడి హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు రాంబల్ నాయక్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాంబల్ నాయక్ మాట్లాడుతూ... 50 రోజులుగా జరుగుతున్న ప్రజా ఉద్యమం ఈ గుడ్డి ప్రభుత్వానికి కనిపించడం లేదా అని ప్రశ్నించారు. వివిధ గ్రామాల ప్రజలు పార్టీలకి అతీతంగా ప్రజలు 50 రోజులుగా రిలే నిరాహార దీక్షలు చేస్తున్నా ప్రభుత్వం స్పందించక పోవడం దారుణమని అన్నారు. స్థానిక అధికార పార్టీ నాయకులు , రాష్ట్ర మంత్రి డంపింగ్ యార్డు రాదు రానివ్వము అంటూ ప్రజలను గందరగోళం సృష్టిస్తు రాజకీయ లబ్ధి పొందాలని చూస్తున్నారని మండిపడ్డారు. నిజంగా ప్రజలపై ప్రేమ ఉంటే వెంటనే జీవో 641 ని వెంటనే రద్దు చేయాలని, హామీలు, మాటలు కాదు చేతలు ద్వారా చూపెట్టాలని డిమాండ్ చేశారు. ఈ ప్రభుత్వం ఇలానే మొండివైఖరితో వ్యవహరిస్తే రాబోయే రోజుల్లో ఉద్యమం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కోనాయపల్లి సర్పంచ్ కుమార్, కొత్తపేట మాజీ సింగల్ విండో కో ఆప్షన్ సభ్యులు జమాల్ ఖాన్, లంబాడీ హక్కుల పోరాట సమితి షాద్ నగర్ డివిజన్ నాయకులు లక్ష్మణ్ నాయక్, మోహన్ నాయక్, సంతోష్ నాయక్, చరణ్ నాయక్, నగేష్ నాయక్ , గ్రామ జేఏసి నాయకులు రాజేందర్ రెడ్డి, శ్రీధరా చారి, గూని మహేష్, వడ్డే మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

హార్డ్‌వేర్ పార్క్ భూ సమస్య పరిష్కారం కోసం ముఖ్యమంత్రిని కలుస్తాం..

- ఐక్యతతో పోరాడితేనే భూ సమస్యకు పరిష్కారం: ప్రొఫెసర్ కోదండరాం



రంగారెడ్డి జిల్లా బ్యూరో, నవంబర్ 22 (జర్నలిస్ట్ డైరీ) :

రంగారెడ్డి జిల్లా ఆదిభట్ల, ఎం.ఎం. కుంట, నాదర్‌గుల్ గ్రామాల పరిధిలో హార్డ్‌వేర్ పార్క్ భూసేకరణతో ఏర్పడిన సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని డిమాండ్ చేస్తూ ఆదివారం బషీర్‌బాగ్ ప్రెస్ క్లబ్‌లో హార్డ్‌వేర్ పార్క్ భూసేకరణ బాధితుల సమావేశం నిర్వహించారు. అభినందన హౌసింగ్ వెల్ఫేర్ సొసైటీ, హార్డ్‌వేర్ పార్క్ వ్యతిరేక పోరాట కమిటీ (జేఏసీ), తెలంగాణ జన సమితి ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో శాసనమండలి సభ్యులు, టి.జే.ఎస్ అధ్యక్షులు ప్రొఫెసర్ కోదండరాం, సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఇ.టి. నరసింహ, తెలంగాణ విద్యావంతుల వేదిక రాష్ట్ర అధ్యక్షులు అంబటి నాగయ్య, టి.జే.ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బైరి రమేష్ తదితరులు పాల్గొన్నారు.తెలంగాణ జన సమితి అధ్యక్షులు, ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం మాట్లాడుతూలి.. గతంలో అధికారులను కలిసినప్పుడు స్పష్టమైన సమాధానం ఇవ్వకుండా, మరోసారి సమావేశమవుదామని వాయిదాలు వేస్తూ వచ్చారని అన్నారు. అయితే, ప్రస్తుతం భూములకు సంబంధించిన పూర్తి సమాచారం, అన్ని పత్రాలు సేకరించామని, భూముల విస్తీర్ణం, ప్రస్తుత పరిస్థితి, న్యాయపరమైన అంశాలపై స్పష్టమైన వివరాలు మన చేతిలో ఉన్నాయని తెలిపారు. ఈ సమాచారంతో ప్రభుత్వాన్ని నిర్దిష్టంగా ప్రశ్నించి, సమస్య పరిష్కారం కోసం గట్టిగా నిలబడే అవకాశం ఏర్పడిందన్నారు. పూర్తి వివరాలతో కూడిన లేఖను ఎంపీ ద్వారా ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి, సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. బాధితులకు న్యాయం జరిగే వరకు వారికి అండగా ఉంటూ, వారితో కలిసి పోరాడుతామని స్పష్టం చేశారు. సుదీర్ఘకాలంగా పోరాటం చేస్తున్న బాధితులు నిరాశ చెందకుండా ఐక్యతతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.

2004లో హార్డ్‌వేర్ పార్క్, వర్క్ సెంటర్ పేరుతో చేపట్టిన భూసేకరణలో భాగంగా సుమారు 5,000 ఎకరాలకు 28 నోటిఫికేషన్లు జారీ చేశారు. అయితే, నష్టపరిహారం చెల్లించని అనేక భూములను కూడా ఎ+××జ పేరుతో రెవెన్యూ రికార్డుల్లో నమోదు చేసి నిషేధిత జాబితాలో చేర్చారు. ఈ భూసేకరణను సవాలు చేస్తూ రైతులు న్యాయస్థానాలను ఆశ్రయించగా, ఆదిభట్లలోని సర్వే నంబర్లు 46 నుంచి 53 వరకు జారీ చేసిన నోటిఫికేషన్లను హైకోర్టు కొట్టివేయగా, రాష్ట్ర ప్రభుత్వం దాఖలు చేసిన అప్పీలును సుప్రీంకోర్టు కూడా కొట్టివేసింది. ఇదే పరిధిలోని సర్వే నంబర్ 67లో ఉన్న అభినందన హౌసింగ్ వెల్ఫేర్ సొసైటీకి చెందిన 245 ప్లాట్ల చుట్టూ ఇటీవల TGIIC అధికారులు నోటీసులు ఇవ్వకుండా, నష్టపరిహారం చెల్లించకుండా ప్రహరీ గోడ నిర్మించడంతో వివాదం ఏర్పడింది. దీనిపై అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందన లేకపోవడంతో బాధితులు ఆందోళన చేపట్టారు. తమ జీవితకాల సంపాదనతో ప్లాట్లు కొనుగోలు చేసిన సామాన్య, మధ్యతరగతి కుటుంబాలకు న్యాయం చేయాలని, సుమారు 20,000 ప్లాట్ల యజమానుల సమస్యను ప్రభుత్వం పరిష్కరించాలని బాధితులు డిమాండ్ చేస్తున్నారు. హైకోర్టు, సుప్రీంకోర్టు తీర్పుల నేపథ్యంలో బాధితుల భూములను భూసేకరణ నోటిఫికేషన్ల నుంచి మినహాయించి, నిషేధిత జాబితా నుంచి తొలగించాలని, అభినందన హౌసింగ్ వెల్ఫేర్ సొసైటీ ఆధీనంలోని భూముల నుంచి TGIIC అధికారులు తక్షణమే వైదొలగాలని డిమాండ్ చేశారు. భూసేకరణకు సంబంధించిన పూర్తి వివరాలను పరిశీలించి రైతులు, ప్లాట్ల యజమానులకు న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.ఈ సమస్యకు సంబంధించి ఇటీవల జరిగిన పరిణామాన్ని జేఏసీ నాయకులు ప్రస్తావించారు. బాలాపూర్ మండల తహసీల్దార్ రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌కు సమర్పించిన నివేదికలో, క్షేత్రస్థాయిలో ప్లాట్ల యజమానులే తమ ప్లాట్ల స్వాధీనంలో ఉన్నట్లు పేర్కొన్నారని తెలిపారు. ఈ నివేదికను తమ ఐక్య పోరాటానికి లభించిన విజయంగా భావిస్తున్నామని హర్షం వ్యక్తం చేశారు. ఈ పోరాటానికి అన్ని రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు, ప్రజాస్వామికవాదులు, తెలంగాణ ఉద్యమకారులు, ప్రజలు మద్దతు తెలిపి బాధితులకు అండగా నిలవాలని జేఏసీ నాయకులు విజ్ఞప్తి చేశారు.ఈ సమావేశంలో హార్డ్‌వేర్ పార్క్ వ్యతిరేక పోరాట కమిటీ చైర్మన్, హైకోర్టు న్యాయవాది మాధవరం రామేశ్వర్ రావు, టి.జే.ఎస్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు, జేఏసీ కన్వీనర్ దార సత్యం, అభినందన హౌసింగ్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షులు గండూరి భాస్కర్, ప్రధాన కార్యదర్శి ఎస్.ఎస్.ఆర్.కె. నరేంద్ర, బాధితులు తదితరులు పాల్గొన్నారు.

సైబరాబాద్ మూవ్స్ సైక్లింగ్ యాత్ర కార్యక్రమాన్ని ప్రారంభించిన గాంధీ.

రంగారెడ్డి జిల్లా బ్యూరో, నవంబర్ 22 (జర్నలిస్ట్ డైరీ) :

జేఎన్‌టీయూ నుండి హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ వరకు సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన సైబరాబాద్ మూవ్స్ సైక్లింగ్ యాత్ర కార్యక్రమంలో సైబరాబాద్ సీపీ రమేష్ రెడ్డి, స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి, తాజా మాజీ కార్పొరేటర్ నార్నె శ్రీనివాస రావు తో కలిసి ముఖ్యఅతిథిగా పాల్గొని జెండా ఊపి యాత్రను ప్రారంభించిన పియేసి చైర్మన్ ఆరెక పూడి గాంధీ.

ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ సైబరాబాద్ లో పెరుగుతున్న ట్రాఫిక్ రద్దీని తగ్గించేందుకు ప్రతిఒక్కరు సామాజిక బాధ్యత అని, నిత్యం పెరుగుతున్న ట్రాఫిక్ ను దృష్టిలో పెట్టుకొని ప్రతి ఒక్కరు బాధ్యత యుతంగా ట్రాఫిక్ నియమాలను పాటించాలని,ప్రజా రవాణా, సైక్లింగ్ ను ప్రోత్సహించడం ద్వారా ట్రాఫిక్ రద్దీ తో పాటు కాలుష్యం తగ్గునని తెలియచేశారు .సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్, సైబరాబాద్ పోలీస్, సొసైటీ ఫర్ సైబరాబాద్ సెక్యూరిటీ కౌన్సిల్ సంయుక్త ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు సైబరాబాద్ మూవ్స్ సదస్సు ను నవంబర్ 26,27,28, వరకు రాయదుర్గంలోని టీ హబ్ లో కార్యక్రమం నిర్వహించడం జరుగుతుంది అని తెలియచేశారు.ట్రాఫిక్ సమస్యల పరిష్కారం, ప్రజా రవాణా ప్రోత్సాహం, రోడ్డు భద్రత , పర్యావరణహిత ప్రయాణాలపై ప్రత్యేక అవగాహన కల్పించడమే ముఖ్య ఉద్దేశ్యం అని, వారంలో కనీసం ఒక ఒక్కరోజైనా సైకిల్ మీద వెళ్లాలని, విద్యార్థులు, ఉద్యోగులు, పారిశ్రామికవేత్తలు పాల్గొని తమ ఆలోచనలు పంచుకోవాలని నిర్వాహకుల ప్రత్యేక ఆహ్వానం పలుకుతున్నామని తెలియచేశారు.



చిన్నారుల ఆరోగ్యమే లక్ష్యంగా పల్స్ పోలియో కార్యక్రమంలో పాల్గొన్న మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్

రంగారెడ్డి జిల్లా బ్యూరో, నవంబర్ 22 (జర్నలిస్ట్ డైరీ)



రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలోని పలు వార్డులు, ప్రాంతాల్లో నిర్వహించిన ప్రత్యేక పల్స్ పోలియో కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్ పాల్గొని చిన్నారులకు స్వయంగా పోలియో చుక్కలు వేశారు.ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ.. పోలియో రహిత సమాజ నిర్మాణమే లక్ష్యంగా ప్రభుత్వం చేపడుతున్న పల్స్ పోలియో కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ విజయవంతం చేయాలని కోరారు. ఐదేళ్లలోపు వయస్సు గల ప్రతి చిన్నారికి తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని, తల్లిదండ్రులు ఈ విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. చిన్నారుల ఆరోగ్యమే దేశ భవిష్యత్తుకు పునాది అని, పోలియో మహమ్మారిని పూర్తిగా నిర్మూలించేందుకు ప్రజలందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో పోలియో కేంద్రాల ద్వారా చిన్నారులకు చుక్కలు వేస్తూ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. ప్రజారోగ్య పరిరక్షణలో వైద్య సిబ్బంది చేస్తున్న సేవలను అభినందించారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ పట్టణ అధ్యక్షుడు కొంకళ్ల చెన్నయ్య ముదిరాజ్, కౌన్సిలర్లు సి. పెంటయ్య, సంతోషి భాయి చందులాల్, దిలీప్, మున్సిపల్ కో-ఆప్షన్ సభ్యుడు సయ్యద్ ఖదీర్, ముబారక్ అలీఖాన్, మాజీ కౌన్సిలర్ చేగురి రాజేందర్ రెడ్డి, షఫీద్దిన్, నీరటి వాసు, రవితేజ ,కత్తి చంద్రశేఖర అప్ప,మంగ అశోక్ నవీన్ రెడ్డి,తదితరులు పాల్గొన్నారు.

మోతీ నగర్ లో జరిగిన సమైక్య కమ్మ సంఘం కార్తీక మాస వన భోజన మహోత్సవం కార్యక్రమంలో పాల్గొన్న గాంధీ.

రంగారెడ్డి జిల్లా బ్యూరో, నవంబర్ 22 (జర్నలిస్ట్ డైరీ) :



మోతీ నగర్ లో జరిగిన సమైక్య కమ్మ సంఘం మోతీనగర్ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్తీక మాస వన భోజన మహోత్సవం కార్యక్రమంలో కమ్మ కార్పొరేషన్ చైర్మన్ బండి రమేశ్ గారు, తాజా మాజీ కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ తో కలిసి ముఖ్యఅతిథిగా పాల్గొన్న పియేసి చైర్మన్ ఆరెక పూడి గాంధీ.ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ కమ్మ సంఘం కొండాపూర్ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్తీక మాస వన భోజన మహోత్సవం నిర్వహించుకోవడం చాలా సంతోషంగా ఉంది అని, కార్తీకమాసములో కాలనీ వాసులు, బంధువులు, స్నేహితులతో కలసి చెట్ల నీడలో (ప్రత్యేకించి ఉసిరి చెట్టు నీడన) కలసి భోజనం చేయటాన్ని వన భోజనం అంటారు. ప్రకృతితో మన బంధాన్ని గుర్తుచేసుకునే రోజుగా చెప్పవచ్చు అని తెలియచేశారు.

వానా కాలం తర్వాత వచ్చే శీతాకాలంలో వచ్చే కార్తీక మాసంలో వచ్చే శ్వాసకోస వ్యాధులు, జ్వరాలు ప్రజలను ఇబ్బంది పెడుతుంటాయి. వనభోజనం కారణంగా వివిధ రకాల ఆయుర్వేద మొక్కలు, వృక్షాల నుండి వచ్చే గాలి అందరికి దివ్య ఔషధంగా పనిచేస్తోంది. వన భోజనాలు చేయడంవలన మన ఆరోగ్యం మాత్రమే కాదు, ప్రకృతిని కాపాడుకున్న వాళ్ళం అవుతాము అని, పర్యావరణ పరిరక్షణ అనే భావన ఈ వనభోజనాలలో అంతర్లీనంగా దాగి ఉంది అని. ప్రకృతిని మనం కాపాడుకుంటే ప్రకృతి మనల్ని కాపాడుతుందనే సందేశం ఈ వనభోజనాలలో దాగి ఉంది అని తెలియచేశారు. వన భోజనాలు వంటి కార్యక్రమాలలో పాల్గొనడం వలన నాయకత్వ లక్షణాలు రావడం, బాధ్యతలు ఏర్పడటం, బంధు మిత్రుల మధ్య సాన్నిహిత్యం, భావ వ్యక్తీకరణ నైపుణ్యం పెరుగుతుంది అని , సంబంధ బాంధవ్యాలు మరింత బలపడతాయి అని తెలియచేశారు.ఈ కార్యక్రమంలో కమ్మవారి సేవా సంఘాల సమాఖ్య తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అడుసుమిల్లి వెంకటేశ్వర రావు, కార్యదర్శి పాతూరి వెంకట రావు, ఆర్గనైజింగ్ సెక్రటరీలు పాండురంగారావు, పినపాక ప్రభాకర్, మరియు కొల్లి వెంకటేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్ట్ డైరీ
తెలుగు దినపత్రిక

ఒడిశా నుంచి హైదరాబాద్‌కు గంజాయి అక్రమ రవాణా ముఠా గుట్టురట్టు....

ఎస్ఓటి ఉప్పల్ జోన్ బృందం - నాచారం పోలీసుల సంయుక్త ఆపరేషన్...





నాగారం, నవంబర్ 22:-(జర్నలిస్ట్ డైరీ)

ఒడిశా నుంచి హైదరాబాద్ కు గంజాయి అక్రమ రవాణా చేస్తున్న ముఠా గుట్టురట్టును మ ఎస్ఓటి ఉప్పల్ జోన్ బృందం ఈ నెల 20వ తేదీన నిర్వహించిన ఆపరేషన్ లో ఛేదించారు. మల్కాజిగిరి పోలీస్ కమీషనర్ బి సుమతి ఐపిఎస్ మార్గదర్శకత్వంలో ఈ ఆపరేషన్ ను ఉప్పల్ పోలీసులు నిర్వహించారు.

కేసు వివరాలోకి వెళితే నాచారం పోలీస్ స్టేషన్ క్రైమ్ నెంబర్: 671/2026, ఎన్డీపీఎస్ చట్టంలోని సెక్షన్ 8(సి) r/w ఆర్/డబ్ల్యు 20(బి)(ii)(సి) ప్రకారం కేసు నమోదు చేయబడింది.ఒడిశా రాష్ట్రం నుంచి హైదరాబాద్‌కు గంజాయిని అక్రమంగా రవాణా చేస్తున్నట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న ముగ్గురు వ్యక్తులను ఎస్ఓటి ఉప్పల్ జోన్ బృందం మరియు నాచారం పోలీసులు పట్టుకున్నారు. వారి వద్ద నుంచి సుమారు 60.380 కిలోల ఎండిన గంజాయిని (అంచనా విలువ రూ.30 లక్షలు), రవాణాకు ఉపయోగించిన కారును, నాలుగు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు.

నిందితుల వివరాలు ఇలా ఉన్నాయి. 1. సమీర్ హసన్ అలీ షేక్ ఏ రవి కుమార్ చౌదరి (42) -- డ్రైవర్, జోగేశ్వరి ఈస్ట్, ముంబై, మహారాష్ట్ర నివాసి. 2. మహమ్మద్ ఖాన్ (52)హైదరాబాద్‌లోని కోటి ప్రాంతంలో ఉన్న అలీ కేఫ్ హోటల్‌లో వంట మాస్టర్‌గా పనిచేస్తున్నాడు. కింగ్ కోఠి, హైదరాబాద్ నివాసి. స్వస్థలం సూర్యాపేట జిల్లా. 3. చందన్ కుమార్ జెనా (31) డ్రైవర్, కూకట్‌పల్లి, హైదరాబాద్ నివాసి. స్వస్థలం బాలాసోర్ జిల్లా, ఒడిశా. 4. రాహుల్ ఏ కృష్ణ ఏ ఖిలో -- బెర్హంపూర్, ఒడిశా నివాసి. ప్రధాన సరఫరాదారు/నిర్వాహకుడిగా ఆరోపణలు ఎదుర్కొంటున్నాడు. ప్రస్తుతం పరారీలో ఉన్నాడు. 5. అజయ్ సాగర్, గంజాయి సేకరణ, లోడింగ్‌లో సహకరించినట్లు ఆరోపణలు ఉన్నాయి. ప్రస్తుతం పరారీలో ఉన్నాడు.

స్వాధీనం చేసుకున్న ఆస్తి... సుమారు 60.380 కిలోల ఎండిన గంజాయి -- 60 ప్యాకెట్లలో.

గంజాయి ప్యాకింగ్‌కు ఉపయోగించినట్లు భావిస్తున్న గోధుమరంగు అంటుకునే టేపు చుట్టలు, 60 ఖాళీ చుట్టలు. లినాలుగు మొబైల్ ఫోన్లు.

ఎంహెచ్01బికె9751 రిజిస్ట్రేషన్ నంబరు గల నీలిరంగు ఫియట్ లీనియా కారు. స్వాధీనం చేసుకున్న గంజాయి అంచనా విలువ సుమారు రూ.30 లక్షలు. ఆపరేషన్ జరిగిన ప్రదేశం మరియు ఈ నెల 20 తేదీన విశ్వసనీయ సమాచారం మేరకు నాచారం పోలీసులు నాచారం--చిలుకానగర్ రోడ్డులోని ఐడిఏ నాచారం, రోడ్ నంబర్ 5, స్టెర్లింగ్ షూస్ కంపెనీ సమీపంలో ప్రత్యేక ఆపరేషన్ నిర్వహించారు. సాయంత్రం సుమారు 18:23 గంటలకు ఎంహెచ్01బికె9751 నంబరు గల నీలిరంగు ఫియట్ లీనియా కారును పోలీసులు అడ్డగించారు. కారులో ప్రయాణిస్తున్న ముగ్గురు వ్యక్తులు పోలీసులను గమనించి పారిపోవడానికి ప్రయత్నించగా, పోలీసులు వారిని పట్టుకున్నారు.వాహనాన్ని తనిఖీ చేయగా, డిక్కీలో దాచిన నాలుగు ప్లాస్టిక్ గోనె సంచుల్లో గోధుమరంగు అంటుకునే టేపుతో చుట్టిన 60 గంజాయి ప్యాకెట్లు లభించాయి. పంచ సాక్షుల సమక్షంలో ప్యాకెట్లను తెరిచి పరిశీలించి తూకం వేయగా, వాటి మొత్తం బరువు సుమారు 60.380 కిలోలుగా నమోదైంది. నేర విధానం.... బెర్హంపూర్, ఒడిశాకు చెందిన ప్రధాన నిందితుడిగా పేర్కొంటున్న రాహుల్ ఏ కృష్ణ ఏ ఖిలో అంతర్రాష్ట్ర గంజాయి రవాణా నెట్‌వర్క్‌ను నిర్వహిస్తున్నట్లు దర్యాప్తులో ఆరోపణలు వెలుగులోకి వచ్చాయి. ఇజాజ్ అనే వ్యక్తి ద్వారా ఎ-1 సమీర్‌తో పరిచయం ఏర్పరచుకుని, ఒడిశాలో కిలోకు సుమారు రూ.2,000 చొప్పున గంజాయిని సేకరించి హైదరాబాద్, ముంబైలకు తరలించి అధిక ధరకు విక్రయించేలా ప్రతిపాదించినట్లు సమాచారం. రాహుల్ ఫియట్ లీనియా కారును ఏర్పాటు చేసి, గంజాయిని తరలించేందుకు ఎ-1 సమీర్, ఎ-2 మహమ్మద్ ఖాన్, ఎ-3 చందన్ కుమార్ జెనాలను నియమించుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఒక్కో ట్రిప్‌కు రూ.5,000 నుంచి రూ.8,000 వరకు చెల్లిస్తానని హామీ ఇచ్చినట్లు తెలుస్తోంది.

కోటి అలీ కేఫ్ హోటల్‌కు గతంలో వాటర్ బాటిళ్లు సరఫరా చేసే పనిలో పరిచయమైన చందన్ కుమార్ జెనాను మహమ్మద్ ఖాన్ పరిచయం చేసినట్లు విచారణలో వెల్లడైంది.ఈ నెల16తేదిన నిందితులు ఒడిశా వైపు ప్రయాణం ప్రారంభించారు.

ఈ నెల 17తేదిన పటాన్‌చెరు సమీపంలో రాహుల్ దిగిపోయి, ఓఆర్ఆర్ పెద్ద అంబర్‌పేట్ సమీపంలో మహమ్మద్ ఖాన్‌ను, రామోజీ ఫిల్మ్ సిటీ గేట్ వద్ద చందన్ కుమార్ జెనాను కారులో ఎక్కించుకోవాలని సమీర్‌కు సూచించినట్లు ఆరోపణలు ఉన్నాయి. ముగ్గురూ డ్రైవింగ్‌ను మారుస్తూ, వాట్సాప్ కాల్స్ ద్వారా రాహుల్‌తో సంప్రదింపులు జరుపుతూ బెర్హంపూర్‌కు వెళ్లారు.

ఈ నెల18 తేదిన బెర్హంపూర్ చేరుకున్న తరువాత రాహుల్ సూచనల మేరకు కారును అజయ్ సాగర్‌కు అప్పగించారు. అజయ్ నాలుగు గోనె సంచుల్లో 60 గంజాయి ప్యాకెట్లను లోడ్ చేసి కారును తిరిగి ఇచ్చినట్లు ఆరోపణలు ఉన్నాయి. అనంతరం గంజాయిని హైదరాబాద్‌లోని ఐడిఏ నాచారానికి తరలించాలని, చివరి డెలివరీ వివరాలను తరువాత తెలియజేస్తానని రాహుల్ సూచించినట్లు సమాచారం. ఈ నెల19వ తేదీన తెల్లవారుజామున ముగ్గురు బెర్హంపూర్ నుంచి హైదరాబాద్‌కు బయలుదేరి విశాఖపట్నం, అనకాపల్లి, తుని, అన్నవరం, ఖమ్మం, సూర్యాపేట మీదుగా ఎన్ హెచ్-65 మరియు ఓఆర్ఆర్ పెద్ద అంబర్‌పేట్ మార్గంలో ప్రయాణించినట్లు విచారణలో తెలిసింది. పోలీసుల తనిఖీల నుంచి తప్పించుకునేందుకు టోల్ గేట్లను తప్పించుకుంటూ, డ్రైవింగ్‌ను మారుస్తూ, వాట్సాప్ కాల్స్ ద్వారా రాహుల్‌తో మాట్లాడినట్లు ఆరోపణలు ఉన్నాయి.ఈ నెల 20వ తేదిన సాయంత్రం సుమారు 18:23 గంటలకు ఐడిఏ నాచారంలోని స్టెర్లింగ్ షూస్ కంపెనీ సమీపంలో రాహుల్ తదుపరి సూచనల కోసం వేచి ఉన్న సమయంలో నాచారం పోలీసులు కారును అడ్డగించి, సుమారు 60.380 కిలోల గంజాయితో ముగ్గురిని పట్టుకున్నారు.

తదుపరి దర్యాప్తు...

పరారీలో ఉన్న ప్రధాన నిందితుడు రాహుల్ ఏ కృష్ణ ఏ ఖిలో మరియు అజయ్ సాగర్‌ను గుర్తించి అరెస్టు చేయడం, ఒడిశాలో గంజాయి సేకరణ మూలాన్ని గుర్తించడం, ఆర్థిక లావాదేవీలను పరిశీలించడం, గంజాయి అందుకోవాల్సిన వ్యక్తులు మరియు పంపిణీ నెట్‌వర్క్‌ను గుర్తించడం, ఈ అక్రమ రవాణాలో పాల్గొన్న ఇతర వ్యక్తుల వివరాలు సేకరించడం వంటి అంశాలపై దర్యాప్తు కొనసాగుతోందని కమీషనర్ సుమతి తెలిపారు. కాగా బి. సుమతి, ఐపీ -- పోలీస్ కమిషనర్, మల్కాజిగిరి కమిషనరేట్ ఆధ్వర్యంలో కె. సురేష్ కుమార్, ఐపిఎస్ ఇజాజ్ ఉప్పల్ జోన్.

కె. మనోహర్ --డిసిపి ఎస్ఓటి. వై. వెంకట్ రెడ్డి ఎసీపి ఉప్పల్ డివిజన్. ఆర్. రఘునాథ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్, నాచారం పోలీస్ స్టేషన్. ఎన్. వసంత్ కుమార్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్, ఎస్ఓటి ఉప్పల్ జోన్ మరియు బృందం.

నాచారం పోలీస్ సిబ్బంది ఉన్నారు.

మాదకద్రవ్యాలపై మల్కాజిగిరి పోలీసులది శూన్య సహనం అని, డ్రగ్స్‌కు నో చెప్పండి యువతను కాపాడండి, భవిష్యత్తును రక్షించండి అంటూ మల్కాజిగిరి కమిషనరేట్ పోలీసులు కోరారు.

చిన్నారులకు పోలియో చుక్కలు వేసిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

- ప్రతి చిన్నారికి పోలియో చుక్కలు వేయించాలి -తల్లిదండ్రులకు పిలుపు



రంగారెడ్డి జిల్లా బ్యూరో, నవంబర్ 22 (జర్నలిస్ట్ డైరీ)

రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ వద్ద నిర్వహించిన ప్రత్యేక పల్స్ పోలియో కార్యక్రమంలో షాద్‌నగర్ ఎమ్మెల్యే, ప్రభుత్వ రంగ సంస్థల కమిటీ చైర్మన్ వీర్లపల్లి శంకర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా చిన్నారులకు స్వయంగా పోలియో చుక్కలు వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గారు మాట్లాడుతూ.. పోలియో రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ బాధ్యతగా ముందుకు రావాలని సూచించారు. ఐదేళ్లలోపు పిల్లలందరికీ తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు. పోలియో వ్యాధి నుంచి చిన్నారులను రక్షించేందుకు ప్రభుత్వం చేపడుతున్న ఈ కార్యక్రమాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.ప్రతి చిన్నారి ఆరోగ్యంగా, ఆనందంగా ఎదగాలంటే చిన్నతనం నుంచే తగిన ఆరోగ్య జాగ్రత్తలు తీసుకోవడం ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు. పోలియో చుక్కలు వేయించడంలో ఎలాంటి నిర్లక్ష్యం చేయవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్, మాజీ జడ్పీటీసీ వెంకట్ రాం రెడ్డి,పట్టణ అధ్యక్షుడు నల్లమోని శ్రీధర్ ముదిరాజ్, డిప్యూటీ డీఎంహెచ్ఓ విజయలక్ష్మి, హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీనివాస్,కౌన్సిలర్ సి పెంటయ్య, కళ్యాణకర్ దిలీప్, శివ ఎస్పీ ,మున్సిపల్ కో ఆప్షన్ సభ్యుడు సయ్యద్ ఖదీర్,సుజీవన్,నేతలు చందు లాల్,ముబారక్ అలీ ఖాన్, ఇబ్రహీం ,కత్తి చంద్రశేఖర అప్ప, నాగమణి, మధువలు యాదవ్,తంగడపల్లి శంకర్, గుడిపల్లి బీరప్ప, మంగ అశోక్, రవితేజ, జయప్రకాష్, ఎస్సీ సెల్ నియోజకవర్గం కన్వీనర్ జాంగారి రవి, వెలిజర్ల గ్రామ సర్పంచ్ బాబు నాయక్, కరుణాకర్, నెహ్రూ నాయక్, జంగయ్య, రమేష్ , ఆశాలు,తదితరులు పాల్గొన్నారు.

చిన్నారుల ఆరోగ్య భద్రతకు రెండు చుక్కలే శ్రీరామరక్ష..!

8వ వార్డులో చిన్నారులకు పల్స్ పోలియో చుక్కలు వేసిన కౌన్సిలర్ సుధీర్



రంగారెడ్డి జిల్లా బ్యూరో, నవంబర్ 22 (జర్నలిస్ట్ డైరీ)

చిన్నారులను పోలియో మహమ్మారి నుంచి కాపాడి, ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని షాద్‌నగర్ పట్టణ 8వ వార్డు కౌన్సిలర్ సుధీర్ అన్నారు. ఆదివారం నిర్వహించిన పల్స్ పోలియో కార్యక్రమంలో భాగంగా 8వ వార్డులో చిన్నారులకు ఆయన స్వయంగా పోలియో చుక్కలు వేశారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ సుధీర్ మాట్లాడుతూ ఐదేళ్లలోపు ప్రతి చిన్నారికి తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని తల్లిదండ్రులకు సూచించారు. పోలియో వ్యాధి చిన్నారుల నాడీ వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపి శాశ్వత అంగవైకల్యానికి దారితీసే ప్రమాదం ఉందన్నారు. ముందస్తు నివారణతోనే ఈ వ్యాధిని పూర్తిగా అరికట్టవచ్చని తెలిపారు.ప్రభుత్వం నిర్వహిస్తున్న పల్స్ పోలియో కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని, రెండు చుక్కల పోలియో మందు చిన్నారులకు రక్షణ కవచంగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఐదేళ్లలోపు ఏ ఒక్క చిన్నారి కూడా పోలియో చుక్కలు వేయించుకోకుండా మిగిలిపోకూడదని, తల్లిదండ్రులు బాధ్యతగా వ్యవహరించాలని కోరారు.పోలియో రహిత సమాజ నిర్మాణానికి వైద్య సిబ్బంది, ప్రజాప్రతినిధులు, తల్లిదండ్రులు సమిష్టిగా కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

కొండాపూర్ కమ్మ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్తీక మాస వన భోజన మహోత్సవంలో పాల్గొన్న గాంధీ.



రంగారెడ్డి జిల్లా బ్యూరో, నవంబర్ 22 (జర్నలిస్ట్ డైరీ) :

శేరిలింగంపల్లి డివిజన్ పరిధిలోని బొటానికల్ గార్డెన్ లో జరిగిన కొండాపూర్ కమ్మ సంఘం వారి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్తీక మాస వన భోజన మహోత్సవం కార్యక్రమంలో తాజా మాజీ కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ తో కలిసి ముఖ్యఅతిథిగా పాల్గొన్న పియేసి చైర్మన్ ఆరెక పూడి గాంధీ.

ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ కమ్మ సంఘం కొండాపూర్ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్తీక మాస వన భోజన మహోత్సవం నిర్వహించుకోవడం చాలా సంతోషంగా ఉంది అని, కార్తీకమాసములో కాలనీ వాసులు, బంధువులు, స్నేహితులతో కలసి చెట్ల నీడలో ((ప్రత్యేకించి ఉసిరి చెట్టు నీడన) కలసి భోజనం చేయటాన్ని వన భోజనం అంటారు. ప్రకృతితో మన బంధాన్ని గుర్తుచేసుకునే రోజుగా చెప్పవచ్చు అని తెలియచేశారు.వానా కాలం తర్వాత వచ్చే శీతాకాలంలో వచ్చే కార్తీక మాసంలో వచ్చే శ్వాసకోస వ్యాధులు, జ్వరాలు ప్రజలను ఇబ్బంది పెడుతుంటాయి. వనభోజనం కారణంగా వివిధ రకాల ఆయుర్వేద మొక్కలు, వృక్షాల నుండి వచ్చే గాలి అందరికి దివ్య ఔషధంగా పనిచేస్తోంది. వన భోజనాలు చేయడంవలన మన ఆరోగ్యం మాత్రమే కాదు, ప్రకృతిని కాపాడుకున్న వాళ్ళం అవుతాము అని, పర్యావరణ పరిరక్షణ అనే భావన ఈ వనభోజనాలలో అంతర్లీనంగా దాగి ఉంది అని. ప్రకృతిని మనం కాపాడుకుంటే ప్రకృతి మనల్ని కాపాడుతుందనే సందేశం ఈ వనభోజనాలలో దాగి ఉంది అని తెలియచేశారు. వన భోజనాలు వంటి కార్యక్రమాలలో పాల్గొనడం వలన నాయకత్వ లక్షణాలు రావడం, బాధ్యతలు ఏర్పడటం, బంధు మిత్రుల మధ్య సాన్నిహిత్యం, భావ వ్యక్తీకరణ నైపుణ్యం పెరుగుతుంది అని , సంబంధ బాంధవ్యాలు మరింత బలపడతాయి అని తెలియచేశారు.ఈ కార్యక్రమంలో కమ్మసంఘం కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఘోర రోడ్డు ప్రమాదం ఒకే కుటుంబానికి చెందిన నలుగురి దుర్మరణం









- వికారాబాద్ మండలం బుగ్గ రామేశ్వరం మలుపు వద్ద విషాదం





జర్నలిస్ట్ డైరీ వికారాబాద్ నవంబర్ 22

వికారాబాద్ మండల పరిధిలో ఆదివారం ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. మండలంలోని పెండ్లిమడుగు గ్రామానికి చెందిన ఒకే కుటుంబానికి చెందిన నలుగురు వ్యక్తులు ఆటోలో కేరెల్లి గ్రామానికి వెళ్తుండగా ఈ దుర్ఘటన జరిగింది. బుగ్గ రామేశ్వరం సమీపంలోని మూలమలుపు వద్ద వీరు ప్రయాణిస్తున్న ఆటోను ఎదురుగా వస్తున్న లారీ ఢీకొట్టడంతో ఈ ప్రమాదం సంబవించింది ఈ ప్రమాదంలో ఆటో డ్రైవర్‌తో పాటు ముగ్గురు మహిళలు తీవ్ర గాయాలపాలై అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. మృతులను పెండ్లిమడుగు గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ నాగేష్, చంద్రమ్మ, పార్వతమ్మ, సరితగా గుర్తించారు. వీరంతా ఒకే కుటుంబానికి చెందిన వారని గ్రామస్థులు తెలిపారు.కాలుకు కట్టు కట్టించుకోవడానికి కేరెల్లి గ్రామానికి వెళ్లి వస్తుండగా ఈ విషాదం చోటుచేసుకుందని పెండ్లిమడుగు గ్రామస్థులు తెలిపారు. మృతులంతా వ్యవసాయ కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగించేవారని, ఒకే కుటుంబంలో నలుగురు మృతి చెందడంతో గ్రామంలో తీవ్ర విషాదఛాయలు అలుముకున్నాయని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేశారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకుని, తగిన ఆర్థిక సహాయం అందించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

జర్నలిస్ట్ డైరీ
తెలుగు దినపత్రిక

అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్న కుల్కచర్ల మండల పరిషత్ అధికారులు


-ఉద్దేశపూర్వకంగానే ఒకే రోజు, ఒకే సమయానికి ఏడు గ్రామ పంచాయతీల్లో ఎక్కరే ఎలా?

-అర్జీదారులను తప్పదోవ పట్టిస్తున్న కుల్కచర్ల మండల అధికారులు

-అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్న ఎంపీడీవో, ఏపీఐఓ, పంచాయతీకార్యదర్శులు







జర్నలిస్ట్ డైరీ కుల్కచర్ల: నవంబర్ 22

సామాన్య ప్రజలకు వజ్రాయుధం లాంటి సమాచారకు చట్టాన్ని ఉద్దేశపూర్వకంగానే కుల్కచర్ల మండల ప్రజా పరిషత్ కార్యాలయ సిబ్బంది పి ఐ ఓ పంచాయతీ కార్యదర్శులు సమాచార హక్కు చట్టాన్ని తుంగలో తొక్కుతున్నారు పంచాయతీ కార్యదర్శులు నిధుల దుర్వినియోగం బయటపడుతుందని కారణం చేత సమాచారాన్ని ఇవ్వడానికి జంకుతూ సాకుల కారణంతో దాటవేశ ధోరణి వ్యవహరిస్తున్నారు ,

కుల్కచర్ల మండల అధికారుల నిర్లక్ష్యం, బాధ్యతారాహిత్యం పరాకాష్టకు చేరింది. నిధుల లేమి సాకుతో పేజీల జిరాక్స్ ప్రతులు ఇవ్వడం సాధ్యం కాదని సమాచారం ఇవ్వకూడదని ఉద్దేశపూర్వకంగానే చేతులెత్తేసిన అధికారులు, సెక్షన్ 2(j)(i) కింద గ్రామ పంచాయతీల రికార్డులను ప్రత్యక్షంగా తనిఖీ (Inspection) చేసుకునేందుకు ఇచ్చిన షెడ్యూల్ చూస్తే విస్తుపోవాల్సిందే.ఒకే మనిషి ఒకే సమయంలో ఏడు గ్రామపంచాయతీలో ఎలా?ఒకే మనిషి ఒకే సమయంలో వేర్వేరు గ్రామాలకు వెళ్లి తనిఖీ చేయడం అసాధ్యమని తెలిసి కూడా , ఒకే తేదీ మరియు ఒకే సమయానికి ఏకంగా ఏడు గ్రామ పంచాయతీల్లో షెడ్యూల్ ఇవ్వడం చూస్తుంటే అధికారుల వైఖరి అర్థమవుతుంది , ప్రజలు కట్టే పన్నుల నుండి జీతాలు తీసుకుంటూ ప్రజలకు జవాబు జవాబుదారీతనంగా ఉండాల్సిన అధికారులు మాత్రం సమాచారాన్ని ఇవ్వడానికి మాత్రం జంకుతున్నారు,

అసంబద్ధ షెడ్యూల్‌తో అర్జీదారులకు వేధింపులు

మండల ప్రజా పరిషత్ సహాయ పౌర సమాచార అధికారి (APIO) జారీ చేసిన గ్రామ పంచాయతీల తనిఖీ షెడ్యూల్ అధికారుల సమన్వయ లోపాన్ని బట్టబయలు చేస్తోంది:

ఏడు వేరువేరు గ్రామపంచాయతీలకు ఒకే తారీఖున ఒకే సమయానికి తనిఖీకి రావాల్సిందిగా ఒకే సమయం ఇచ్చారు.

ఉన్నతాధికారులు స్పందించలి

సమాచారం బయటకు పొక్కకుండా ఉండేందుకే పంచాయతీ కార్యదర్శులు, పబ్లిక్ ఇన్ఫర్మేషన్ ఆఫీసు సిబ్బంది ఉద్దేశపూర్వకంగానే ఇలాంటి తప్పుడు షెడ్యూల్‌తో అర్జీదారులను తప్పదోవ పట్టిస్తున్న అధికారుల పై చర్యలు తీసుకోవాలి పర్యవేక్షణ కొరవడి, ఆర్టీఐ నిబంధనలను తుంగలో తొక్కుతున్న కుల్కచర్ల ఎంపీడీవో, సహాయ పౌర సమాచార అధికారి (APIO), మరియు సంబంధిత గ్రామ పంచాయతీ కార్యదర్శులందరికీ జిల్లా కలెక్టర్, జిల్లా పంచాయతీ అధికారి (DPO) తక్షణమే షోకాజ్ నోటీసులు జారీ చేయాలని ప్రజలు, సామాజిక కార్యకర్తలు డిమాండ్ చేస్తున్నారు. బాధ్యులపై కఠిన క్రమశిక్షణా చర్యలు తీసుకోవడంతో పాటు, మండల యంత్రాంగానికి ఆర్టీఐ చట్టం అమలుపై ప్రత్యేక శిక్షణ ఇవ్వాలని కోరుతున్నారు.

సీనియర్ కాంగ్రెస్ కార్యకర్త మల్లెపోగు ముత్యాలు మృతి

కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.8 వేల ఆర్థిక సాయం అందజేసిన కాంగ్రెస్ నాయకులు



మిడ్జిల్, నవంబర్ 22 జర్నలిస్ట్ డైరీ

మిడ్జిల్ మండల పరిధిలోని కంచనపల్లి గ్రామానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ కార్యకర్త మల్లెపోగు ముత్యాలు మృతి చెందారు. ఆయన మృతివార్త తెలుసుకున్న మిడ్జిల్ మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు కంచనపల్లి గ్రామానికి చేరుకుని మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

ఈ సందర్భంగా మృతుడి కుటుంబానికి అండగా నిలుస్తూ అంత్యక్రియల ఖర్చుల నిమిత్తం రూ.8,000 ఆర్థిక సాయం అందజేశారు. కష్టకాలంలో కుటుంబానికి అండగా ఉంటామని నాయకులు భరోసా కల్పించారు.

ఈ కార్యక్రమంలో మిడ్జిల్ మాజీ సర్పంచ్ శారద వెంకటయ్య, అల్వాల్ రెడ్డి, మిడ్జిల్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఎండీ గౌస్, మండల ఉపాధ్యక్షుడు వెంకట శివప్రసాద్, అయ్యాలు, చెన్నయ్య, జాంగిర్ తదితర కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

భారత్ చేరుకున్న నేపాల్ ప్రధాని.

-. సోమవారం ప్రధాని మోదీతో చర్చలు



న్యూఢిల్లీ:నవంబర్ 22 (జర్నలిస్ట్ డైరీ) :

నేపాల్ ప్రధాని బాలెన్ షా తొలి పర్యటనలో భాగంగా ఆదివారం భారత్ చేరుకున్నారు. వాణిజ్య, పరిశ్రమల శాఖ సహాయ మంత్రి జితిన్ ప్రసాద ఢిల్లీ ఎయిర్‌పోర్ట్‌లో ఆయనకు స్వాగతం పలికారు. సోమవారం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, నేపాల్ ప్రధాని బాలెన్ షా సమావేశం కానున్నారు. ఇంధనం, జలవిద్యుత్, రైల్వేలు, కనెక్టివిటీ, మౌలిక సదుపాయాల రంగాలతో పాటు ద్వైపాక్షిక సంబంధాల బలోపేతంపై చర్చలు జరుగనున్నాయి.కాగా, నేపాల్‌లో పలు ప్రాజెక్టులను ఇరు దేశాల ప్రధానమంత్రులు వర్చువల్‌గా ప్రారంభించనున్నారు. అలాగే ఆర్థికవృద్ధి, సామాజిక అభివృద్ధి, మౌలిక సదుపాయాల విస్తరణ, సాంకేతిక పరిజ్ఞానం, ప్రకృతి వైపరీత్యాలు, వాతావరణ మార్పు వంటి సమస్యలను పరిష్కరించడం వంటి అంశాలపై కూడా చర్చించనున్నట్లు తెలుస్తున్నది. భారతదేశం నేపాల్‌కు అతిపెద్ద వాణిజ్య, రవాణా, పెట్టుబడి భాగస్వామి ఉన్నది. భారత మార్కెట్‌లోకి పన్ను రహిత ప్రవేశాన్ని కూడా ఆ దేశం పొందుతున్నది. మరోవైపు నేపాల్, భారత్ మధ్య చాలా కాలంగా సరిహద్దు వివాదం కూడా ఉన్నది. లిపులేఖ్, లింపియాధురా, కాలాపాని ప్రాంతాలు ఉత్తరాఖండ్‌లో భాగమని భారత్ స్థిరంగా వాదిస్తున్నది. మే నెలలో నేపాల్ ప్రధాని బాలెన్ షా వివాదస్పద వ్యాఖ్యలు చేశారు. సరిహద్దు వివాదాన్ని పరిష్కరించడానికి చైనా, బ్రిటన్ దేశాల ప్రమేయాన్ని ఆయన కోరారు. అయితే మూడో పక్షాల పాత్రను భారత్ తిరస్కరించింది. సరిహద్దు సమస్యకు సంబంధించిన అన్ని అంశాలను పరిష్కరించుకోవడానికి ఇరు దేశాల మధ్య ఒక సుస్థిరమైన ద్వైపాక్షిక యంత్రాంగం ఉన్నదని పేర్కొంది.

దేశాధ్యక్షుడినైన నాకంటే ఆమెకు బిడ్డపైనే ప్రేమ ఎక్కువ..

- కరోలిన్ లీవిట్ గురించి ట్రంప్ ఆసక్తికర వ్యాఖ్యలు..!



న్యూఢిల్లీ నవంబర్ 22 (జర్నలిస్ట్ డైరీ) :

వైట్‌హౌస్ మాజీ ప్రెస్ సెక్రెటరీ కరోలిన్ లీవిట్ పదవి నుంచి వైదొలిగినప్పటి నుంచి కొత్త సెక్రెటరీ ఎంపిక కోసం ట్రంప్ యంత్రాంగం వెతుకుతున్నది. ఇటీవల కేటీ జకారియా ను కొత్త ప్రెస్ సెక్రెటరీగా నియమించినా ఆమె పనితీరుపై విమర్శలు వచ్చాయి. ఆమె విద్యార్హతలపై కూడా ప్రశ్నలు తలెత్తాయి. దాంతో పదవి చేపట్టిన ఐదు రోజుల్లోనే తొలగించాల్సి వచ్చింది.ఈ నేపథ్యంలో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కరోలిన్ లీవిట్ గురించి కీలక వ్యాఖ్యలు చేశారు. దేశాధ్యక్షుడినైన తనకంటే ఆమెకు బిడ్డపైనే ఎక్కువ ప్రేమ ఉందని అన్నారు. అందుకే ఆమె బిడ్డకు జన్మనిచ్చిన తర్వాత తిరిగి విధుల్లోకి రావడానికి ఒప్పుకోలేదని చెప్పారు. వైట్‌హౌస్ ప్రెస్ సెక్రెటరీగా ఆమె హుందాగా, అద్భుతంగా పనిచేశారని ప్రశంసించారు. ఇప్పుడు ఆమె స్థానంలో మరొకరిని నియమించడం కష్టంగా మారిందన్నారు. నిజంగా ఇది చాలా పెద్ద సమస్యని, ఈ విషయాన్ని తాను ఆమెతో కూడా చెప్పానని ట్రంప్ తెలిపారు. ఆమె నాకంటే తన బిడ్డనే ఎక్కువగా ప్రేమిస్తోందని, ఇది చాలా గొప్ప విషయమని అన్నారు. ప్రస్తుతం కరోలిన్ ఓ మీడియా సంస్థలో పని చేస్తున్నదని, త్వరలోనే ఆమె ఒక పెద్ద స్టార్ అవుతుందని ట్రంప్ పేర్కొన్నారు.

అమెరికా ఆంక్షలను తప్పించుకొనేందుకు

రహస్య ఆపరేషన్!

అధునాతన ఏఐ చిప్‌ల సేకరణకు ప్రత్యేక నిఘా బృందం ఏర్పాటు

చైనా నిఘా సంస్థ ప్రయత్నిస్తున్నదన్న ఎన్ వైటీ..ఖండించిన చైనా



బీజింగ్:నవంబర్ 22 (జర్నలిస్ట్ డైరీ) :

అధునాతన సెమీకండక్టర్, కృత్రిమ మేధ చిప్‌లను సమకూర్చుకోవడం, ప్రపంచ చిప్ పరిశ్రమపై సమాచారం సేకరించడాన్ని చైనా నిఘా సంస్థ పనిగా పెట్టుకున్నదని న్యూయార్క్ టైమ్స్(ఎన్‌వైటీ) నివేదిక తెలిపింది. పాశ్చాత్య దేశాల, ముఖ్యంగా అమెరికా ఎగుమతి ఆంక్షలను తప్పించుకునేందుకు కనీసం రెండేండ్లుగా ఈ సంస్థ ఈ రహస్య ఆపరేషన్ నిర్వహిస్తున్నదని పేర్కొంది.ఈ ప్రయత్నాలకు నేతృత్వం వహించేందుకు చైనా భద్రత శాఖ అధిపతి చెన్ యిసిన్ ఆధ్వర్యంలో ఒక కార్య బృందాన్ని ఏర్పాటు చేసినట్లు ఆసియా, అమెరికా, యూరప్‌లకు చెందిన ప్రస్తుత, మాజీ భద్రతా–నిఘా అధికారుల నివేదికను ఉటంకించింది. అధునాతన చిప్‌లను చైనా కంపెనీలు కొనుగోలు చేయడం, దేశంలోకి అక్రమంగా తరలించడంలో తోడ్పడటంతో పాటు సెమీకండక్టర్ పరిశ్రమ, దాని సరఫరా వ్యవస్థలపై సమాచారం సేకరించడం ఈ ఆపరేషన్‌లో భాగమని వివరించింది. ఎన్విడియా మాజీ సీఈవో జెన్సన్ హువాంగ్‌పై నిఘా పెట్టేందుకు చైనా నిఘా సంస్థతో చైనా వ్యాపారవేత్త ఆలిస్ హువాంగ్ కలిసి పనిచేసినట్లు అమెరికా అధికారులు ఆరోపిస్తున్న నేపథ్యంలో ఈ వివరాలు వెలుగులోకి వచ్చాయి. ఈ నెల 21న ప్రచురితమైన ఎన్ వైటీ కథనం, అంతకు ముందు రోజు దర్యాప్తు కథనాన్ని కొనసాగించింది.

జడ్జి అనుకుని ఒవైసీకి గౌరవ వందనం

యూపీ పోలీసుల పారపాటు



సహారన్‌పూర్ నవంబర్ 22 (జర్నలిస్ట్ డైరీ) :

ఉత్తరప్రదేశ్‌లోని సహారన్‌పూర్‌లో ఆసక్తికర ఘటన చోటుచేసుకుంది. సుప్రీంకోర్టు న్యాయమూర్తికి స్వాగతం పలికేందుకు సిద్ధమైన పోలీసులు పొరపాటున ఏఐఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీకి గౌరవ వందనం సమర్పించారు. శనివారం స్థానిక సర్క్యూట్ హౌస్‌లో ఈ ఘటన జరిగింది. ఆజాద్ సమాజ్ పార్టీ అధినేత చంద్రశేఖర్‌ను కలిసేందుకు ఒవైసీ తన భద్రతా సిబ్బందితో కలిసి సర్క్యూట్ హౌస్‌కు వచ్చారు.సుప్రీంకోర్టు న్యాయమూర్తి రాక నేపథ్యంలో పోలీసులు ఆయనకు గౌరవ వందనం అందించేందుకు ఏర్పాట్లు చేశారు. ఒవైసీని న్యాయమూర్తి రాకగా పొరబడిన సిబ్బంది వెంటనే సెల్యూట్ చేస్తూ, గౌరవ వందనం సమర్పించారు. పోలీసులు తనకు సెల్యూట్ చేయడాన్ని గమనించిన ఒవైసీ అక్కడే ఆగిపోయారు. కదలకుండా నిలబడి వారి గౌరవ వందనాన్ని స్వీకరించారు. ఈ ఘటనపై జిల్లా ఎస్పీ విచారణకు ఆదేశించారు.

శిలాజ ఇంధనాలపై కుదరని ఏకాభిప్రాయం

-ఒప్పందం లేకుండానే ముగిసినఐక్యరాజ్యసమితి వాతావరణ సదస్సు

-బొగ్గు, చమురు, సహజ వాయువుల వినియోగంపై దేశాల మధ్య విభేదాలు

అంటల్యా నవంబర్ 22 (జర్నలిస్ట్ డైరీ) :

ప్రపంచాన్ని పట్టిపీడిస్తున్న భూతాపం కట్టడికి చేపట్టాల్సిన చర్యలపై వివిధ దేశాల మధ్య ఏకాభిప్రాయం కుదరలేదు. తుర్కియేలోని అంటల్యాలో రెండు వారాలపాటు జరిగిన ఐక్యరాజ్యసమితి వాతావరణ సదస్సు (కాప్–31) ఆదివారం కీలక ఒప్పందం లేకుండానే ముగిసింది. బొగ్గు, చమురు, సహజ వాయువుల వినియోగం నుంచి వైదొలగే అంశాన్ని తుది ప్రకటనలో చేర్చాలా? వద్దా? అనేదానిపై విభేదాలు తలెత్తాయి.తుర్కియే, ఆస్ట్రేలియా రూపొందించిన ప్రతిపాదనను యూరోపియన్ యూనియన్ సహా పలు దేశాలు వ్యతిరేకించాయి. రష్యా, సౌదీ అరేబియా శిలాజ ఇంధనాల ప్రస్తావనను వ్యతిరేకించాయి. 2023లో దుబాయ్ సదస్సులో శిలాజ ఇంధనాల నుంచి క్రమంగా వైదొలగాలని నిర్ణయించినప్పటికీ ఆ తర్వాతి చర్చల్లో దీనిపై స్పష్టత కొరవడింది. కార్బన్ క్యాప్చర్, నిల్వకు ప్రాధాన్యమివ్వడంపైనా అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. పేద దేశాలకు ఆర్థిక సాయం, వాతావరణ మార్పులపై కార్యాచరణ వంటి అంశాలు వచ్చే ఏడాది ఇథియోపియా సదస్సుకు వాయిదా పడ్డాయి. అయితే విద్యుత్ వినియోగాన్ని పెంచే ప్రతిపాదనకు దాదాపు 100 దేశాలు మద్దతు తెలిపాయి. 2035 నాటికి మొత్తం ఇంధన వినియోగంలో విద్యుత్ వాటాను 21 శాతం నుంచి 35 శాతానికి పెంచాలని లక్ష్యంగా పెట్టుకున్నాయి. పారిస్ ఒప్పందం నిర్దేశించిన 1.5 డిగ్రీల భూతాప పరిమితిని ప్రపంచం దాటడం అనివార్యమని ఐక్యరాజ్య సమితి హెచ్చరించింది. ఈ శతాబ్దం చివరి నాటికి ఉష్ణోగ్రతలు 2.7–3 డిగ్రీలు పెరిగే ప్రమాదముందని శాస్త్రవేత్తలు అంచనా వేస్తున్నారు. 2026 అత్యంత వేడి సంవత్సరంగా నమోదయ్యే అవకాశం 97 శాతమని బెర్క్లీ ఎర్త్ వెల్లడించింది.



చిన్నారుల్లో ఇలాంటి లక్షణాలు కనిపిస్తే జాగ్రత్త..

అది టైప్-1 డయాబెటిస్ అయ్యే అవకాశాలు ఉంటాయి..



పిల్లలు ఎండలో ఆడుకున్న తర్వాత దాహం వేయడం, నీళ్లు ఎక్కువగా తాగడం సహజమే. అయితే ఎప్పుడూ దాహంగా ఉండటం, పదేపదే మూత్ర విసర్జన చేయడం వంటి లక్షణాలు కనిపిస్తే తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలి. ఇవి పిల్లల్లో టైప్-1 మధుమేహం ప్రారంభ సూచనలు అవుతాయని వైద్యులు చెబుతున్నారు. పిల్లల్లో కనిపించే ఈ లక్షణాలను చాలాసార్లు తల్లిదండ్రులు సాధారణమైనవిగా భావించి నిర్లక్ష్యం చేస్తుంటారు. కానీ సకాలంలో గుర్తించి వైద్యులను సంప్రదించడం చాలా ముఖ్యం.

టైప్-1 డయాబెటిస్‌తో పిల్లల్లో కనిపించే లక్షణాలు..

పిల్లల్లో ఎక్కువగా కనిపించే మధుమేహ రకాల్లో టైప్-1 మధుమేహం ఒకటి. ఈ సమస్య ఉన్నప్పుడు శరీరంలో ఇన్సులిన్ ఉత్పత్తి నిలిచిపోతుంది. ఫలితంగా రక్తంలో చక్కెర స్థాయిలు పెరుగుతాయి. అదనంగా ఉన్న చక్కెరను మూత్రం ద్వారా బయటకు పంపించేందుకు మూత్రపిండాలు ఎక్కువగా పనిచేస్తాయి. ఈ క్రమంలో శరీరంలోని ద్రవాలు కూడా ఎక్కువగా బయటకు వెళ్లిపోవడంతో పిల్లలకు విపరీతమైన దాహం వేస్తుంది. దాహం కారణంగా నీళ్లు ఎక్కువగా తాగడం, తరచూ మూత్ర విసర్జన చేయడం జరుగుతుంది. రాత్రిపూట కూడా పదేపదే నిద్రలేచి మూత్రానికి వెళ్లడం, చాలాకాలంగా రాత్రిపూట మంచం తడపని పిల్లలు అకస్మాత్తుగా మళ్లీ అలా చేయడం వంటి మార్పులు కనిపిస్తాయి. చిన్నారుల విషయంలో డైపర్లు తరచూ తడవడం కూడా గమనించాల్సిన అంశం.

నిర్లక్ష్యం చేస్తే ప్రమాదం..

వీటితోపాటు ఎంత ఆహారం తీసుకున్నా బరువు తగ్గడం, తరచూ ఆకలి వేయడం, నీరసం, చిరాకు వంటి లక్షణాలు కూడా కనిపిస్తాయి. ఇన్సులిన్ లోపం వల్ల శరీరం చక్కెరను శక్తిగా వినియోగించుకోలేక కొవ్వు, కండర కణజాలాన్ని విచ్ఛిన్నం చేయడం ప్రారంభిస్తుంది. మధుమేహాన్ని గుర్తించకుండా వదిలేస్తే డయాబెటిక్ కీటో అసిడోసిస్ అనే ప్రమాదకర పరిస్థితి తలెత్తుతుంది. ఇందులో రక్తంలో చక్కెర స్థాయిలు బాగా పెరగడంతో శరీరంలోని కొవ్వు విచ్ఛిన్నమై కీటోన్లు అనే ఆమ్ల పదార్థాలు ఏర్పడతాయి. పిల్లల శ్వాసలో అసిటోన్ వంటి వాసన రావడం, కడుపునొప్పి, వాంతులు, వేగంగా లేదా గట్టిగా శ్వాస తీసుకోవడం, మగత, గందరగోళం వంటి లక్షణాలు కనిపించే అవకాశం ఉంటుంది. ఇవి ఇతర ఇన్ఫెక్షన్ల లక్షణాల్లా అనిపించినా నిర్లక్ష్యం చేయకూడదు. ఇలాంటి లక్షణాలు ఉంటే వెంటనే అత్యవసర వైద్య సహాయం తీసుకోవాలి.

ఏం చేయాలి..?

పిల్లల్లో మధుమేహాన్ని గుర్తించేందుకు వైద్యులు వేలి నుంచి కొద్దిపాటి రక్తాన్ని తీసి పరీక్షించడం లేదా మూత్ర పరీక్ష చేయడం ద్వారా ప్రాథమికంగా నిర్ధారిస్తారు. ప్రతి చిన్న దాహాన్నీ మధుమేహంగా భావించాల్సిన అవసరం లేదు. అయితే అధిక దాహంతోపాటు తరచూ మూత్ర విసర్జన, మంచం తడపడం, బరువు తగ్గడం, నీరసం వంటి లక్షణాలు కలిపి కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలి. టైప్-1 మధుమేహం ఎక్కువగా తీపి పదార్థాలు తినడం వల్ల రాదు. శరీర రోగనిరోధక వ్యవస్థ పొరపాటున ఇన్సులిన్ ఉత్పత్తి చేసే కణాలపై దాడి చేయడం వల్ల ఈ సమస్య ఏర్పడుతుంది. సరైన ఇన్సులిన్ చికిత్స, రక్తంలో చక్కెర స్థాయిల పర్యవేక్షణ, పోషకాహారం, వ్యాయామం వంటి చర్యలతో మధుమేహం ఉన్న పిల్లలు కూడా ఇతర పిల్లల్లాగే చదువుకోవచ్చు, ఆటలు ఆడుకోవచ్చు. పిల్లల ఆరోగ్య పరిస్థితి గురించి ఉపాధ్యాయులు, పాఠశాల నర్సులకు తెలియజేయడం కూడా అవసరమని నిపుణులు చెబుతున్నారు.

పాలలో చక్కెర కలుపుకుని తాగితే అనారోగ్యమట..

-చక్కెరే కాదు ఇవి కూడా కలుపొద్దట..!

పాలు ఆరోగ్యానికి ఎంతో మంచివి..! అయితే ఈ మాట ఒకప్పటి స్వచ్ఛమైన పాలకు మాత్రమే వర్తిస్తుంది. ఇప్పటి ప్రిజర్వ్‌డ్ పాలను ఆరోగ్యానికి మంచివి అనలేం. ఎందుకంటే ఈ ప్రిజర్వ్‌డ్ పాలతో కొత్తకొత్త వ్యాధులు పుట్టుకొస్తున్నాయి. ఈ పాలే ఆరోగ్యానికి మంచివి కాదంటే.. ఈ పాలలో రుచి, తీయదనం కోసం కొందరు వాటికి చక్కెర (ఫబ్రక్టోజ్), బెల్లం , తేనె లాంటివి కలిపి తీసుకుంటుంటారు. వివిధ రకాల పొడులు కలుపుతారు. అయితే పాలల్లో ఇలాంటివి కలుపుకోవడంవల్ల ఆరోగ్యానికి మరింత ముప్పు వాటిల్లుతుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. మరి పాలలో కలుపగూడని ఆ పదార్థాలేమిటో ఇప్పుడు చూద్దాం.



చక్కెర

పాలు తాగే వాళ్లలో చాలామంది అందులో చక్కెర కలుపుకుంటారు. పిల్లలకు కూడా పాలల్లో పంచదార కలిపి తాగిస్తారు. కానీ ఇది ప్రమాదకరం అంటున్నారు ఆరోగ్య నిపుణులు. పాలల్లో పంచదార కలిపితే కేలరీలు మరింత పెరుతాయట. దాంతో ఆ పాలు తాగితే బరువు పెరుగుతారు. ఈ విషయం చాలా మందికి తెలియదు. అందుకే పంచదార కలిపి పాలు తాగుతారు. పాలు, పంచదార కలయిక జీర్ణక్రియపై కూడా ప్రభావం చూపుతుందట. ఎసిడిటీ, మల బద్ధకం, డయేరియా, పైల్స్ లాంటి సమస్యలు వస్తాయట.

చాక్లెట్ సిరప్

పాల రుచిని పెంచడానికి కొందరు చాక్లెట్ సిరప్ కలుపుకుంటారు. అయితే పాలల్లో చాక్లెట్ సిరప్ కలిపి తాగడం వల్ల శరీరంలో రిఫైన్ చేయని కొవ్వులు పెరుగుతాయి. ఇది కూడా బరువు పెరగడానికి, రక్తంలో షుగర్ లెవల్స్ పెరగడానికి కారణమవుతుంది. పలురకాల అనారోగ్య సమస్యలకు దారితీస్తుంది.

కెఫిన్

చాలామంది పాలతో టీ లేదా కాఫీ పౌడర్ కలిపి తాగుతారు. అది కూడా ఆరోగ్యానికి హానికరమే అంటున్నారు ఆరోగ్య నిపుణులు. కెఫిన్ పాలలో కలిపితే పాలలో పోషకాలను శరీరానికి అందకుండా చేస్తుంది. కెఫిన్ కారణంగా నిద్ర లేమి, హార్ట్ బీట్ పెరగడం, జీర్ణ సంబంధ సమస్యలు తలెత్తే అవకాశం ఉంది.

కృత్రిమ స్వీటెనర్స్

ఇక పాలలో తీపి పెరగడానికి కొందరు కృత్రిమ స్వీటెనర్లు వాడతారు. కానీ ఇవి చక్కెరకన్నా ప్రమాదకరమని పలు అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి. కృత్రిమ స్వీటెనర్స్ కలపడం వల్ల వేగంగా బరువు పెరిగే ప్రమాదం ఉంది. కొవ్వులు పెరుగుతాయి. జీర్ణ సంబంధ సమస్యలు తలెత్తుతాయి.

పండుగల సమయంలో స్వీట్లను ఎక్కువగా తింటే షుగర్ లెవల్స్ ఎప్పటికీ అలాగే ఉంటాయా..?




పండుగలు, వేడుకలు వచ్చాయంటే స్వీట్లు, పిండి వంటలు, చక్కెర పానీయాలు తీసుకోవడం సాధారణం. అయితే కొన్ని రోజుల పాటు మితిమీరిన చక్కెర పదార్థాలు తీసుకున్న తర్వాత తిరిగి సాధారణ ఆహారపు అలవాట్లకు మారినా రక్తంలో చక్కెర స్థాయిలు వెంటనే అదుపులోకి వస్తాయా? అనే సందేహం చాలామందిలో ఉంటుంది. ముఖ్యంగా మధుమేహం లేదా ప్రీడయాబెటిస్ ఉన్నవారిలో ఈ ప్రభావం ఎక్కువగా కనిపించే అవకాశం ఉంటుంది. అయితే కొన్ని రోజులు ఆహార నియమాలు పాటించకపోవడం వల్ల ప్రతి ఒక్కరిలో వారాల తరబడి రక్తంలో చక్కెర స్థాయిలు పెరిగే ఉంటాయని చెప్పడానికి తగిన ఆధారాలు లేవు. చక్కెర స్థాయిలు నిరంతరం అసాధారణంగా నమోదవుతుంటే మాత్రం వైద్యులను సంప్రదించి తగిన చికిత్స తీసుకోవాలి.

స్వీట్లను తిన్నాక పరిస్థితి ఎలా ఉంటుంది..?

మనం తీసుకునే కార్బోహైడ్రేట్లు జీర్ణక్రియ సమయంలో చక్కెరలుగా విడిపోయి రక్తంలో కలుస్తాయి. ఈ గ్లూకోజ్‌ను శరీర కణాలు ఉపయోగించుకోవడానికి, అదనపు గ్లూకోజ్‌ను నిల్వ చేసుకోవడానికి క్లోమగ్రంథి ఉత్పత్తి చేసే ఇన్సులిన్ సహాయపడుతుంది. సాధారణంగా రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించగలిగే వారిలో ఈ ప్రక్రియ ద్వారా కొంత సమయానికి గ్లూకోజ్ స్థాయిలు తిరిగి సాధారణ స్థితికి చేరుకుంటాయి. భోజనం చేసిన తర్వాత రక్తంలో చక్కెర పెరగడం సహజమే. అయితే తీసుకున్న ఆహారం పరిమాణం, శరీరంలో ఇన్సులిన్ ఉత్పత్తి, దానికి శరీరం స్పందించే విధానాన్ని బట్టి ఈ పెరుగుదలలో తేడాలు ఉంటాయి. కొన్ని రోజుల పాటు శరీరానికి అవసరమైన దానికంటే ఎక్కువ కేలరీలు తీసుకోవడం జీవక్రియపై ప్రభావం చూపుతాయి. స్వల్పకాలంలో అధికంగా చక్కెర తీసుకోవడం వల్ల కాలేయంలో కొవ్వు పేరుకుపోవడంతోపాటు ఇన్సులిన్‌కు కాలేయం స్పందించే సామర్థ్యం తగ్గినట్లు చిన్నపాటి అధ్యయనాలు వెల్లడించాయి. అయితే ఆరోగ్యవంతుల్లో కొద్దిరోజుల పాటు అతిగా ఆహారం తీసుకోవడం వల్ల ఇన్సులిన్ సున్నితత్వం, గ్లూకోజ్ స్పందనలో మార్పులు వస్తాయని నిరూపితం కాలేదు.

మంచినీళ్లు తక్కువ తాగితేనే కాదు.. మరీ ఎక్కువ తాగినా ఆరోగ్యానికి హానికరమే..!

శరీరం డీ హైడ్రేషన్ కు గురికాకుండా తరచూ మంచి నీళ్లు తాగడం చాలా అవసరం. దాంతో కిడ్నీలు (ఖఐఅఎం) సహా శరీరంలోని సున్నితమైన అవయవాలన్నీ తాజాగా ఉంటాయి. కానీ ఆరోగ్యానికి మంచిది కదా అని అదేపనిగా మంచి నీళ్లు తాగితే అసలుకే మోసం వస్తుందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. డీ హైడ్రేషన్ మాత్రమే కాదు, ఓవర్ హైడ్రేషన్ కూడా ఆరోగ్యానికి హానికరమేనని వారు చెబుతున్నారు. మరి ఓవర్ హైడ్రేషన్ వల్ల కలిగే ఆ దుష్ప్రభావాలు ఏమిటో ఇప్పుడు తెలుసుకుందాం..



ఓవర్ హైడ్రేషన్ దుష్ప్రభావాలు

చాలా మందికి డీహైడ్రేషన్ గురించి తెలుసుగానీ ఓవర్ హైడ్రేషన్ గురించి అంత అవగాహన ఉండదు. పరిమితికి మించి నీరు తాగితే ఈ సమస్య తలెత్తుతుంది. ముఖ్యంగా అథ్లెట్లలో ఇది ఎక్కువ కనిపిస్తుంది. ఓవర్ హైడ్రేషన్ అరుదైన సమస్యే కానీ అథ్లెట్లు తమ సామర్థ్యం పెంచుకునేందుకు నీళ్లు ఎక్కువగా తాగుతారు. శరీరంలో నీరు తగినంత ఉంటే మరింత మెరుగ్గా క్రీడల్లో పాల్గొనవచ్చనేది వారి నమ్మకం. ఈ క్రమంలో శరీరంలో నీరు ఎక్కువై ఎలక్ట్రోలైట్ల (లవణాలు) స్థాయిల్లో మార్పులు వస్తాయి. ముందుగా సోడియం స్థాయి తగ్గిపోతుంది. దీంతో ఆలోచనల్లో స్పష్టత లోపించినట్లు ఉండటం, వాంతులు, కండరాల బలహీనత, పట్టేసినట్లు ఉండటం, తలనొప్పి వంటివి తలెత్తుత్తాయి. అత్యంత అరుదైన సందర్భాల్లో.. మెంటల్ కన్‌ఫ్యూజన్, ఫిట్స్‌తోపాటు కోమాలోకి కూడా వెళ్లొచ్చు. ఈ సమస్యలు తలెత్తకుండా ఉండాలంటే నీరు తాగే విషయంలోనూ నియంత్రణ పాటించాలని వైద్యులు చెబుతున్నారు. సాధారణంగా గంటకు ఒక లీటరుకు మించి నీటిని తాగకూడదని అంటున్నారు. ఈ పరిమితికి లోబడి ఉంటే శరీరంలోని అదనపు నీటిని తొలగించడానికి కిడ్నీలకు తగినంత సమయం దొరుకుతుంది. దాంతో శరీరంలోని ఎలక్ట్రోలైట్ బ్యాలెన్స్ ఆరోగ్యకర స్థాయిలో కొనసాగుతుంది. ఇదిలావుంటే ఓవర్ హైడ్రేషన్‌తో ఇన్‌ఫ్లమేషన్ తలెత్తిన సందర్భాల్లో పాటించాల్సిన కొన్ని చిట్కాలు ఉన్నాయి. పసుపు, అల్లం, ఆకు కూరలు, ఎక్స్‌ట్రా వర్జిన్ ఆలివ్ ఆయిల్, టమాటాలు, విత్తనాలు, గింజలు, గ్రీన్ టీతో ఈ ఇన్‌ఫ్లమేషన్‌ను తగ్గించుకోవచ్చు.

రూ.20కే లభించే ఈ కూరగాయతో ఎంతో ఆరోగ్యం.

-చలికాలంలో తప్పక తినాల్సిందే.. ఎందుకంటే..



చలికాలం వచ్చిందంటే రకరకాల ఆహార పదార్థాలు మనకు అందుబాటులోకి వస్తాయి. ముఖ్యంగా ఈ సీజన్‌లో లభించే కూరగాయలు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. అలాంటి వాటిలో చిలగడదుంప (స్వీట్ పొటాటో) ప్రత్యేకమైనది. కేవలం రూ.20కే లభించే ఈ దుంపతో రోగనిరోధక శక్తిని పెంచుకోవచ్చని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. కాల్చిన చిలగడదుంప ముక్కలపై కొద్దిగా చాట్ మసాలా, నిమ్మరసం చల్లుకుని తినడం ఈ సీజన్‌లో తీసుకోగలిగే ఉత్తమమైన ఆహారాల్లో ఒకటి.

కంటిచూపు పెరిగేందుకు..

చిలగడదుంపల్లో బీటా కెరోటిన్ సమృద్ధిగా ఉంటుంది. శరీరం దీనిని విటమిన్ ఎ గా మార్చుకుంటుంది. ఒక చిలగడదుంప తినడం ద్వారా శరీరానికి రోజువారీ అవసరమైన బీటా కెరోటిన్‌ను పొందవచ్చు. ఇది రోగనిరోధక శక్తిని పెంచడంతోపాటు చర్మ ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది. కంటి చూపును కాపాడడంలో, జీర్ణవ్యవస్థ ఆరోగ్యంగా ఉండడంలోనూ సహాయపడుతుంది. ఇందులో ఉండే పీచు పదార్థం గుండె ఆరోగ్యానికి మేలు చేయడంతోపాటు చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గించడంలో తోడ్పడుతుంది. పేగుల్లో మంచి బ్యాక్టీరియా వృద్ధికి కూడా సహకరిస్తుంది.

బీపీ తగ్గుతుంది..

చిలగడదుంపల్లో పొటాషియం కూడా ఉంటుంది. ఇది రక్తపోటును నియంత్రించడంలో కీలక పాత్ర పోషిస్తుంది. వీటిలోని యాంటీఆక్సిడెంట్లు శరీరంలో వాపును తగ్గించడంలో సహాయపడతాయి. అలాగే చిలగడదుంపలు శరీరానికి స్థిరమైన శక్తిని అందిస్తాయి. రక్తంలో చక్కెర స్థాయిలు ఒక్కసారిగా పెరగడానికి కారణం కావని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. వీటిని ఉడికించి, కాల్చి తినడంతోపాటు కూరలు, వేపుళ్లు, చాట్ వంటి వివిధ రకాల వంటకాల్లోనూ ఉపయోగించుకోవచ్చు.

ఆకట్టుకుంటున్న 'ది లక్ష్మణ' ఫస్ట్ లుక్ పోస్టర్!



భారతీయ సినీ రంగంలో సాంకేతిక విప్లవానికి నాంది పలుకుతూ మరో ప్రతిష్ఠాత్మక ప్రాజెక్ట్ పట్టాలెక్కింది. రామాయణ మహాకావ్యంలో శ్రీరాముడికి అండగా నిలిచి, ఎన్నో సాహసాలు చేసిన మహా యోధుడు లక్ష్మణుడి జీవితంలోని వెలుగులోకి రాని విశేషాలను వెండితెరపై ఆవిష్కరించేందుకు 'ది లక్ష్మణ -- అన్‌టోల్డ్ స్టోరీ' పేరుతో ఓ భారీ చిత్రాన్ని రూపొందిస్తున్నారు. అత్యాధునిక ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సాంకేతికతను ఉపయోగించి, భారతదేశంలోనే తొలి ఫోటోరియలిస్టిక్ ఏఐ చిత్రంగా ఈ ప్రాజెక్ట్‌ను అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తెరకెక్కిస్తున్నారు. సరికొత్త కథనం, అద్భుతమైన విజువల్స్‌తో రూపొందుతున్న ఈ సినిమా భారతీయ చలనచిత్ర నిర్మాణ రంగంలో ఓ కొత్త అధ్యాయానికి శ్రీకారం చుట్టనుంది.రామాయణంలో లక్ష్మణుడి పాత్రకున్న ప్రాధాన్యత, ఆయన చేసిన సాహసాలు, త్యాగాలు, అసాధారణ వీరత్వాన్ని ఇప్పటివరకు ఎవరూ చూడని సరికొత్త కోణంలో ఈ సినిమా ద్వారా ప్రేక్షకులకు పరిచయం చేయనున్నారు. శ్రీమతి మాతా రాజేశ్వరి సమర్పణలో భూమాత ఆర్ట్స్ పతాకంపై ఈ చిత్రం రూపొందుతోంది. ఈ చిత్రానికి పి. రాధాకృష్ణ కథను అందించడంతో పాటు దర్శకత్వ బాధ్యతలను నిర్వహిస్తున్నారు. పవన్ మాతా, నితిన్ మాతా నిర్మాతలుగా వ్యవహరిస్తుండగా, బియాండ్ ఎక్స్ స్టూడియో (దీవఎశీఅఎ శ్రీబఎఅశీ), నాపా డాట్ ఎస్ఐ సంస్థలు ఏఐ సాంకేతిక నిర్మాణ బాధ్యతలను చూసుకుంటున్నాయి. ఇటీవల ఈ చిత్రానికి సంబంధించిన అధికారిక పోస్టర్‌ను ప్రముఖ దర్శకుడు హరీష్ శంకర్ తన ఎక్స్ (శ) ఖాతా ద్వారా డిజిటల్‌గా విడుదల చేయగా, మల్కాజిగిరి ఎంపీ శ్రీ ఈటల రాజేందర్ భౌతికంగా ఆవిష్కరించారు. విడుదలైన పోస్టర్ సినిమాపై ఒక్కసారిగా అంచనాలను పెంచేసింది. దేశవ్యాప్తంగా అన్ని వర్గాల ప్రేక్షకులకు చేరువయ్యేలా తెలుగుతో పాటు ఇంగ్లీష్, హిందీ, కన్నడ, తమిళం, మలయాళం భాషల్లో ఈ చిత్రాన్ని భారీ స్థాయిలో విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. ఒక గొప్ప యోధుడి అజ్ఞాత వీరగాథను అత్యాధునిక ఏఐ సాంకేతికతతో ప్రపంచానికి పరిచయం చేయనున్న 'ది లక్ష్మణ -- అన్‌టోల్డ్ స్టోరీ' పై ఇప్పుడు సినీ ప్రేక్షకుల్లో, ట్రేడ్ వర్గాల్లో విపరీతమైన ఆసక్తి నెలకొంది.

మహేష్ బాబు సినిమాలో విలన్‌గా నటించడానికైనా రెడీ..

అనుపమ పరమేశ్వరన్ కామెంట్స్ వైరల్!



మలయాళ చిత్రం 'ప్రేమమ్'తో హీరోయిన్‌గా పరిచయమైన అనుపమ పరమేశ్వరన్.. ఆ తర్వాత తెలుగు సినిమాల్లోనూ తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. సహజమైన నటన, అందమైన చిరునవ్వు, చలాకీ తనంతో తెలుగు ప్రేక్షకులకు దగ్గరైన ఈ కేరళ కుట్టి ప్రస్తుతం విభిన్నమైన కథలు, పాత్రలతో తన కెరీర్‌ను కొనసాగిస్తున్నారు. తాజాగా టాలీవుడ్ సూపర్ స్టార్ మహేష్ బాబు గురించి అనుపమ చేసిన ఆసక్తికర వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. మహేష్ బాబు సినిమాలో హీరోయిన్‌గా మాత్రమే కాకుండా విలన్‌గా నటించే అవకాశం వచ్చినా తాను సిద్ధమేనని ఆమె చెప్పడం అభిమానులను ఆకట్టుకుంటోంది.ఇటీవల ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న అనుపమ పరమేశ్వరన్‌ను పలువురు హీరోల గురించి ప్రశ్నలు అడిగారు. ఈ క్రమంలో మహేష్ బాబును ఒక్క మాటలో వర్ణించమని యాంకర్ అడగగా.. ఆయన చాలా హ్యాండ్సమ్ అని ఏమాత్రం ఆలోచించకుండా సమాధానమిచ్చారు. మహేష్ బాబు అంటే తనకు ఎంతో ఇష్టమని, ఆయన అందం తనను ఎంతగానో ఆకట్టుకుంటుందని అనుపమ చెప్పుకొచ్చారు. అంతేకాకుండా భవిష్యత్తులో మహేష్ బాబు సినిమాలో నటించే అవకాశం వస్తే పాత్ర విషయంలో ఎలాంటి పరిమితులు పెట్టుకోనని వెల్లడించారు. హీరోయిన్‌గా అవకాశం వచ్చినా, విలన్‌గా నటించే ఛాన్స్ వచ్చినా వెంటనే అంగీకరిస్తానని తన మనసులోని మాటను బయటపెట్టారు. దీంతో మహేష్ అభిమానులు, అనుపమ అభిమానులు ఈ వ్యాఖ్యలపై ఆసక్తికరంగా స్పందిస్తున్నారు. మహేష్ బాబుకు విలన్‌గా నటిస్తే ఎదురయ్యే సరదా ఇబ్బందిని కూడా అనుపమ వివరించారు. సినిమాలో సన్నివేశం ప్రకారం మహేష్ బాబును కోపంగా, కసిగా చూడాల్సి ఉంటుందని.. కానీ ఆయన అందం ముందు అలా నటించడం తనకు కష్టమవుతుందేమోనని నవ్వుతూ చెప్పారు. మహేష్ బాబు సినిమాలో విలన్‌గా నటించే అవకాశం వస్తే, ఆయన వైపు కోపంగా చూడాల్సిన సన్నివేశాల్లో కూడా రొమాంటిక్‌గా చూస్తూ ఉండిపోతానేమో. ఆయన ఎదురుగా నిలబడితే డైలాగులు కూడా మర్చిపోతానేమో" అంటూ సరదాగా వ్యాఖ్యానించారు. ఆమె చెప్పిన ఈ మాటలు అభిమానులకు నవ్వులు పూయించడంతో పాటు సోషల్ మీడియాలో చర్చనీయాంశంగా మారాయి.



టాలీవుడ్ నాకు ఎన్నో నేర్పింది..

సినిమా ఇండస్ట్రీలో అందం, అభినయంతో ప్రేక్షకులను ఆకట్టుకున్న హీరోయిన్లు చాలామందే ఉన్నారు. అయితే ఒకే తరహా పాత్రలకు పరిమితం కాకుండా, ఎప్పటికప్పుడు కొత్త ప్రయోగాలు చేయాలని కోరుకునే నటీమణులు మాత్రం కొద్దిమందే ఉంటారు. అలాంటి వారిలో రకుల్ ప్రీత్ సింగ్ ఒకరు. కెరీర్ ప్రారంభం నుంచి గ్లామర్ పాత్రలతో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న ఈ బ్యూటీ ఇప్పుడు పౌరాణిక పాత్రతో మరోసారి వార్తల్లో నిలుస్తుంది. భారీ బడ్జెట్‌తో రూపొందిన రామాయణం సినిమాలో శూర్పణఖ పాత్రలో కనిపించి మెప్పించింది. ఈ క్రమంలో ఆమె చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు సినీ వర్గాల్లో ఆసక్తిని పెంచుతున్నాయి. రకుల్ ప్రీత్ సింగ్ కెరీర్‌ను పరిశీలిస్తే ఎన్నో విభిన్నమైన పాత్రలు కనిపిస్తాయి. ముఖ్యంగా తెలుగు సినిమాల్లో గ్లామరస్ హీరోయిన్‌గా మంచి గుర్తింపు సంపాదించుకుంది. అయితే ప్రస్తుతం తనకు అలవాటైన ఇమేజ్‌ను పక్కనపెట్టి, నటిగా కొత్త అవకాశాలను అందిపుచ్చుకోవాలని ప్రయత్నిస్తుంది. దర్శకుడు నితేశ్ తివారీ తెరకెక్కిస్తున్న ప్రతిష్టాత్మక 'రామాయణం' చిత్రంలో రకుల్ శూర్పణఖ పాత్రను పోషించింది. సాధారణ హీరోయిన్ పాత్రలకు భిన్నంగా ఉండే ఈ క్యారెక్టర్ ఆమె కెరీర్‌లో ప్రత్యేకంగా నిలిచింది. పౌరాణిక నేపథ్యం ఉన్న పాత్రలో ఆమె ఎలా కనిపిస్తారన్న ఆసక్తి ప్రేక్షకుల్లో నెలకొంది.తాజాగా తన కెరీర్ గురించి మాట్లాడిన రకుల్ తెలుగు చిత్ర పరిశ్రమపై ప్రత్యేక అభిమానాన్ని చాటుకుంది. నటిగా తనకు గుర్తింపు రావడానికి టాలీవుడ్ ఎంతో సహాయపడిందని తెలిపింది. తనలోని నటనా సామర్థ్యాన్ని వెలికితీసి, ఎన్నో అవకాశాలు కల్పించిన ఘనత తెలుగు పరిశ్రమకే దక్కుతుందని పేర్కొంది. జాతీయ స్థాయిలో సినిమాలు చేస్తున్నప్పటికీ తెలుగు చిత్ర పరిశ్రమతో తనకున్న అనుబంధాన్ని రకుల్ మర్చిపోలేదు. టాలీవుడ్‌లో పనిచేసిన అనుభవం తనకు ఎంతో నేర్పిందని, కెరీర్‌లో ఎదురయ్యే సవాళ్లను ధైర్యంగా ఎదుర్కొనేలా చేసిందని చెప్పుకొచ్చింది. తన ఎదుగుదలలో తెలుగు సినిమాల పాత్ర ఎప్పటికీ ప్రత్యేకమని వెల్లడించింది. సినిమా రంగంలో విజయాన్ని అందుకోవాలంటే షార్ట్‌కట్స్ వెతకడం కంటే కష్టపడటమే ముఖ్యమని రకుల్ తెలిపింది. కెరీర్ మొదట్లో తాను పెట్టుకున్న లక్ష్యాలు ఇప్పటికీ అలాగే ఉన్నాయని తెలిపారు. నిరంతరం శ్రమిస్తూ, వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకోవడమే రామాయణం సినిమాలో తన పాత్ర కోసం రకుల్ ప్రత్యేకంగా సిద్ధమయ్యారనే విషయం ఆసక్తికరంగా మారింది. ఈ క్యారెక్టర్‌కు తగిన రూపాన్ని తీసుకురావడానికి మేకప్, కాస్ట్యూమ్స్ విషయంలో చిత్ర బృందం ఎంతో జాగ్రత్తలు తీసుకుంది. ప్రతిరోజూ గంటల తరబడి మేకప్ కోసం కేటాయించిందట. ఈ చిత్రంలో రణ్‌బీర్ కపూర్ రాముడిగా, యశ్ రావణుడిగా, రవి దూబే లక్ష్మణుడిగా కనిపించారు. ఇంతటి భారీ తారాగణం ఉన్న సినిమాలో రకుల్‌కు శూర్పణఖ పాత్ర దక్కడం విశేషం. తన పాత్ర నిడివి కంటే దాని ప్రాధాన్యతపైనే ఆమె దృష్టి పెట్టింది. ఇప్పటివరకు చేసిన పాత్రలతో పోలిస్తే శూర్పణఖ క్యారెక్టర్ రకుల్‌కు పూర్తిగా భిన్నమైనది. అందుకే ఈ సినిమా ఆమె నటనా ప్రయాణంలో మరో మైలురాయిగా నిలిచింది. కేవలం అందం, గ్లామర్‌తోనే కాకుండా నటనకు ప్రాధాన్యత ఉన్న పాత్రలతోనూ ప్రేక్షకులను మెప్పిస్తుంది రకుల్.



కొత్త పాత్ర కోసం కసరత్తులు



బ్లాక్‌బస్టర్ 'రంగస్థలం' తర్వాత సుకుమార్ దర్శకత్వంలో రామ్‌చరణ్ సినిమా చేస్తున్న సంగతి తెలిసిందే. ఈ సినిమా కోసం ఓ క్రేజీ సబ్జెక్ట్‌ని సుకుమార్ సిద్ధం చేసినట్టు వినికిడి. ఇందులో రామ్‌చరణ్ పాత్ర ఆయన కెరీర్‌లోనే అత్యంత బరువైనది, విభిన్నమైనదిగా ఉంటుందని ఇన్‌సైడ్ టాక్. 'పెద్ది' సినిమా కోసం లాంగ్ హెయిర్ పెంచి, ధృఢకాయుడిగా మారారు రామ్‌చరణ్. అలాగే ఈ సినిమాలోని పాత్ర కోసం కూడా ఒక ట్రైనర్‌ని పెట్టుకొని సినిమాకు కావాల్సిన కొత్త లుక్, పర్సనాలిటీ కోసం ఆయన కసరత్తులు మొదలుపెట్టారట. ఈ పాత్రకు కావాల్సిన స్క్రీన్ ప్రెజెన్స్‌ని అద్భుతంగా ప్రజెంట్ చేసే విషయంలో చరణ్ ఎక్కడా కాంప్రమైజ్ కావట్లేదు.ఈ పాన్ ఇండియా సినిమాకు సంబంధించిన ప్రీప్రొడక్షన్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. జనవరి నుంచి రెగ్యులర్ షూటింగ్ మొదలుకానున్నదని సమాచారం. ఇందులో కథానాయిక ఎవరనేది చిత్రబృందం అధికారికంగా ప్రకటించలేదు. సారా అర్జున్, సాత్విక వీరవల్లి, రుక్మిణి వసంత్, భాగ్యశ్రీబోర్సే, శ్రీలీల.. ఇలా చాలామంది కథానాయికల పేర్లు వినిపిస్తున్నాయి. మైత్రీమూవీమేకర్స్, టీ-సిరీస్, సుకుమార్ రైటింగ్స్ కలిసి నిర్మిస్తున్న ఈ చిత్రానికి అనిరుధ్ రవిచందర్ సంగీతం అందించే అవకాశం ఉన్నది.

Printed, Published and Owned by SITARALLA SRIRAMULU and Printed at M/s SRI DIVYA PRINTERS, Plot No. 33 & 34, 2nd Floor, Vasthu Colony, LB Nagar, Ranga Reddy, Telangana - 500074 and Published at H.No. 10-1-101/10. Bhagya Nagar Colony, Lingojiguda, Saroornagar, Ranga Reddy, Telangana - 500035. EDITOR: SITARALLA SRIRAMULU , RNI. No. TELTEL/2015/62524. Cell: 9966443465